మహిళలు సాధించాల్సింది ఎంతో ఉంది

\- మాధురీ దీక్షిత్

మిగతాది 8లో

తెలుగు దినపత్రిక


RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 84 | ఆదివారం మార్చి 09 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


ఇదండీ..కబురు..




# 'ఇది చరిత్రలో నిలిచిపోయే యూనివర్శిటీ కావాలి'

- చాకలి ఐలమ్మ మహిళా యూనివర్శిటీగా నామకరణం
- నేటి మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం
- 100 సంవత్సరాల చరిత్ర కలిగిన కోఠి మహిళా కళాశాలను యూనివర్శిటీగా మార్చడం
- చాకలి ఐలమ్మ యూనివర్శిటీకి ?500 కోట్ల నిధుల మంజూరు
- ప్రధాన మంత్రి రేవంత్ రెడ్డి: "మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి"
- ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆడబిడ్డలకు అండ
- స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించడం



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: కోఠి వుమెన్స్ కాలేజ్ ను యూనివర్శిటీగా మార్చడమే కాకుండా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్శిటీ గా పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,. దొరలపై, నిజాములపై పోరాడిన చాకలి ఐలమ్మ.. చరిత్రలో తనకంటూ పేజీ లిఖించుకున్నారన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా ఈరోజు(శనివారం) అక్కడకు విచ్చేసిన సీఎం రేవంత్ . నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గొప్ప చరిత్ర కల్గిన మహిళ పేరును ఒక యూనివర్శిటీకి పెట్టామన్నారు. వందేళ్ల చరిత్ర కల్గిన చరిత్ర ఈ మహిళా కళాశాలదని, దానిని యూనివర్శిటీగా మార్చి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్శిటీగా నామకరణం చేశామన్నారు. వందేళ్ల క్రితం ఏడుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల.. నేడు ఏడువేల మందితో యూనివర్శిటీగా రూపాంతరం చెందిందన్నారు. దీనికి ఐదు వందల కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు రేవంత్ ప్రకటించారు. ఇది చరిత్రలో నిలిచిపోయే యూనివర్శిటీ కావాలన్నారు సీఎం రేవంత్.మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, అలానే స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆడ బిడ్డలు వంటిళ్లు కుందేళ్లు కాదని, వారు వ్యాపారవేత్తలుగా రాణించాలనేది తన ఆశయమన్నారు.

2లో..




# మహిళలంటే సమాజంలో చిన్నచూపు

## సెకండ్‌గ్రేడ్ వర్కర్స్‌లా ట్రీట్‌మెంట్

## రన్‌ఫర్ యాక్షన్ ప్రారంభించిన మంత్రి సీతక్క

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: పురుషులు, మహిళలు అందరికీ సమానత్వం ఉండాలని, మహిళలు అంటే ప్రతి ఒక్కరిలో గౌరవం ఉండాలని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నగర పోలీసు ఆధ్వర్యంలో రన్ ఫర్ యాక్షన్ 2కె/ 5కె రన్-2025 కార్యక్రమంను మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలందరికీ అంతర్జాతీయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మహిళలంటే సమజంలో ఇంకా చిన్న చూపు చూస్తున్నారు.. మహిళలు అంటే సెకండ్ గ్రేడ్ వర్కర్స్ లా చూస్తున్నారని అన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, అమ్మాయిలను ఆదుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో మహిల వ్యక్తిత్వం వికాసం కోరుకోవాలి.. సమాజంలో మహిళలను ఎదుగనిద్దం, కాపాడుదామని మంత్రి సీతక్క తెలిపారు. మరోవైపు.. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మహిళలకు చేయూత అందిస్తున్నారని, పోలీస్ శాఖ ఫ్రీ హాండ్ ఇచ్చారని అన్నారు. రాష్ట్ర మహిళలకు ప్రభుత్వం నుంచి అమలయ్యే అన్ని హామీలను అందిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

2లో..

# మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి



## మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకపోవడంతో మహిళలు రాజకీయంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలుకానందు వల్ల మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యాన వంటి ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. జనగణనకు బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణన త్వరగా పూర్తిచేస్తే.. రాబోయే బీహార్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలుగా అవుతారన్నారు.

2లో..

# ఎంపీల సమావేశంలో డిప్యూటీ సీఎం కీలక నిర్ణయాలు

## - మొత్తం 28 అంశాలపై చర్చించి..ప్రతిపాదనలు



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజాభవన్‌లో జరిగిన తెలంగాణ ఎంపీల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు హామీలపై చర్చించిన ఎంపీలు .. కేంద్రానికి పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మొత్తం 28 అంశాలపై చర్చించి ప్రతిపాదనలు రూపొందించారు.

2లో..

# వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులో వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి

## - దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



2 లో

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను శనివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో కలిశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు కొండా సురేఖ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులు చేయాల్సిన కార్యక్రమాల గురించి అరగంటకు పైగా తమతో చర్చించి సానుకూలంగా స్పందించారని అన్నారు. వరంగల్‌కు సంబంధించి తాము అడిగిన సమస్యలతో పాటు వరంగల్ రింగ్ రోడ్డుకు కృషి చేస్తామని అశ్విని వైష్ణవ్ స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు. ఈ సందర్భగా అశ్విని వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాజీపేట డివిజన్ వేరుగా ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

2లో..

# హామీల్లో కోతలు..

## రైతులపై వంచన ఒక్కటే రేవంత్‌కు తెలుసు



మహిళలకు రూ. 2500 ఇస్తానని ఇప్పటికీ అతీగతీ లేదు : హరీశ్‌రావు

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి కోతలు కోసిన రేవంత్ రెడ్డి.. ఏడాదిన్నర పాలనలో మహిళలను చేసింది ఎడతెగని వంచనే అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

02



## రాష్ట్రంలో మొదలైన విద్యుత్ కోతలు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక చోట కరెంట్ కోతలు ఉంటూనే ఉన్నాయి. అదేదో నిమిషాల పాటు కాదు.. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది.

02

# కుటుంబ వ్యవస్థను నడిపించడలో మహిళ పాత్ర కీలకం

## - మహిళా లోకానికి కేసీఆర్ శుభాకాంక్షలు



కబురు న్యూస్,హైదరాబాద్,మార్చి08: కుటుంబ వ్యవస్థను ముందుకు నడిపించడంలో మహిళల పాత్ర ఎంతోకీలకమని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళలకు తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీశక్తి ని కొనియాడారు. దేశ సంపదను సృష్టించడంలో పౌరులుగా వారి పాత్ర గొప్పదన్నారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులో వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

డోర్నకల్ భద్రాచలం రైల్వే లైన్ ఉంది కానీ బ్రిడ్జి పూర్తి కాలేదని.. దానిపై విజ్ఞప్తి చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్నటువంటి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా ఇక్కడి సమస్యలపై వినతి పత్రాలు అందజేశామని గుర్తుచేశారు. ఏపీలో ఐదు డివిజన్లు ఉన్నాయని... హైదరాబాద్ తర్వాత పెద్ద మహానగరం వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ వచ్చిందని తెలిపారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్‌ను ఎవరో వచ్చి తామిచ్చామని చెప్పుకుంటే పర్వాలేదన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ అభివృద్ధి చేస్తామని మాటలతో కోటలు కట్టింది కానీ తప్ప ఏం చేయలేదని మండిపడ్డారు. వరంగల్‌కు ఇండస్ట్రీస్ రాలేదు రా వాల్సినటువంటి ఎయిర్‌పోర్ట్ ఎప్పుడో రావాల్సి ఉన్నా ఇంకా రాలేదని చెప్పారు. తమ అందరి కృషితో రైల్వే లైన్ల విస్తరణ ఏర్పాట్లు సాధించుకుందామని అన్నారు. చాలా కాలంగా ప్రజలకు ఉపయోగపడే పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అన్నింటిని అభివృద్ధి చేసుకునే విధంగా ఇందిరమ్మ ప్రభుత్వంలో తామంతా పనిచేస్తున్నామని తెలిపారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్‌తో సహా తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామన్నారు. వాటన్నిటిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీజేపీలో గెలిచిన కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్రం గురించి ఏం పట్టనట్టుగా ఉండటం బాధాకరమని చెప్పారు. ఇకనుంచి అయినా పార్టీలను పక్కనపెట్టి అందరం అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి పనులకు బీజేపీ నేతలు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి వరంగల్‌ను అతిపెద్ద రెండో రాజధానిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయాలనుకుంటున్నారని అన్నారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ కళా సాకారం అవుతున్న వేల దానికి అనుగుణంగా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ ఓఆర్ఆర్ చుట్టూ రైల్వే సదుపాయాన్ని ఇవ్వడంతో పాటు చింతనపల్లిలో ఉన్న కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు కావలసిన విధంగా రైలు మార్గాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కోరామని చెప్పారు. వెంటనే స్పందించిన అశ్విని వైష్ణవ్ రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారని మంత్రి కొండా సురేఖ అన్నారు. పాండురంగాపురం - మల్కాన్ గిరి రైల్వే లైన్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్విన్ వైష్ణవ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజతలు తెలిపారు. పాండురంగాపురం - మల్కాన్ గిరి రైల్వే లైన్ ను సారపాక (భద్రాచలం)వరకు వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని లేఖ ద్వారా మంత్రి తుమ్మల కోరారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు,పెనుబల్లి నుంచి కొండపల్లి వరకు కొత్త రైల్వే లైన్లు మంజూరు చేయాలని లేఖలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## సంపాదకీయం

# సంపాదకీయం

## సుపరిపాలనకు దోవ

'సివిల్ సర్వీసు అధికారికి ఎంత తెలుసనేది కాదు... ఆ అధికారి ఎంత జాగ్రత్తగా విధి నిర్వహణ చేస్తారన్నదే అసలైన పరీక్ష' అన్నారు ప్రథమ భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. అఖిల భారత సర్వీసుల రూపశిల్పి, దేశ తొలి ఉపప్రధాని సర్దార్ పటేల్ సైతం ఈ అధికారుల గురించి చెప్పిన మాటలు వారి బాధ్యతను గుర్తుచేస్తాయి. సివిల్ సర్వీసులకు ఎంపికైనవారు స్వతంత్రంగా, నిజా యితీగా, నిర్భీతితో వ్యవహరించగలిగితేనే పటిష్టమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అభిలషించారు. కానీ ఇప్పటికీ ఆచరణలో సమస్యలు తప్పడం లేదు. ఈమధ్య తమ ముందు కొచ్చిన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఐఏఎస్‌ల తీరుపై కటువుగా వ్యాఖ్యానించింది. ఐఏఎస్‌లు తరచు తాము ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకన్నా అధికులమని భావిస్తారనీ, అది సరికాదనీ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిలతో కూడిన ధర్మా సనం తెలిపింది. సివిల్ సర్వీసుల రూపకర్తలు ఇలాంటి అంతరాలను చూడలేదు. విధి నిర్వహణకు సంబంధించినంత వరకూ ఈ సర్వీసుల్లోని వారు దేశాభివృద్ధినీ, భద్రతనూ కాంక్షించి అందుకు అనువైన నిర్ణయాలు తీసుకుంటూ తమ విధులు నిర్వర్తించాలని కోరుకుంది. స్వభావరీత్యా విధి నిర్వహణ భిన్నంగా ఉండొచ్చు. ఇందులో ఎక్కువ, తక్కువ అనే సమస్యే రాకూడదు. సాధారణంగా సివిల్ సర్వీస్ వైపు వచ్చే యువతీయువకులకు సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపైనా, వాటివల్ల కలుగుతున్న అనర్థాలపైనా ఆగ్రహం ఉంటుంది. వాటి పరిష్కారం తమవల్ల సాధ్యమేనన్న విశ్వాసం ఉంటుంది. సంపాదనే ప్రధానమనుకుంటే ఏ బహుళజాతిసంస్థకో మేనేజర్‌గా లేదా సీఈవోగా వెళ్లవచ్చు. సివిల్ సర్వీసుల్లోకన్నా అత్యధిక జీతం, ఇతర సదు పాయాలూ, ఆస్తుల సంపాదన ఉంటాయి. పైగా అక్కడ అధిక శ్రమ, పని ఒత్తిడి ఉండవు. కానీ సివిల్ సర్వీస్‌లు అలా కాదు. ప్రభుత్వంలో ఎక్కడో కిందిస్థాయి అధికారి తీసుకునే పొరపాటు నిర్ణయం ఆ ప్రాంతంలోనో, ఆ జిల్లాలోనో, కొన్ని సందర్భాల్లో రాష్ట్రంలోనో కల్లోలానికి దారి తీయొచ్చు. ప్రభుత్వ పథకాల అమలులో చోటుచేసుకునే చిన్న లోపం కూడా సాధారణ పౌరులను కలవరపరిచి వారు ప్రాణం తీసుకునే ప్రమాదం కూడా ఉండొచ్చు. లేదా అధికారిపై దౌర్జన్యానికి దిగొచ్చు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవటం, అనుకోని సమస్య ఎదురైతే సమయస్ఫూర్తితో వ్యవహరించటం తప్పనిసరి. అలాగని ఈ అంతరాలు లేవని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఐఏఎస్‌లు మొదటి స్థానంలో ఉంటారు. ఆ తర్వాత ఐపీఎస్‌లు వస్తారు. ఇది పాలనా సౌలభ్యం కోసం చేసిన ఏర్పాటు. స్వల్ప వ్యత్యాసంతో ఇద్దరి ప్రారంభ వేతనాలూ... ఆరోగ్యం, ఆవాసం, సెలవులు, ఇతర సదుపాయాలూ ఒకేలావుంటాయి. మొదటి మూడు నాలుగు నెలలు ఉమ్మడిగా శిక్షణనిచ్చినా బాధ్యతలరీత్యా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు వేర్వేరుచోట్ల ప్రత్యేక శిక్షణనిస్తారు. ఒక జిల్లాకో, ఒక ప్రాంతానికో బాధ్యత వహించే ఐఏఎస్ అధికారి అక్కడి పాలనా వ్యవస్థను పటిష్టపరచటానికి నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుంది. ఎవరిని ఏ స్థానంలో పనిచేయించాలో, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా అక్కడి ప్రజల అభ్యున్నతికి ఏమేం చేయవచ్చునో అధ్యయనం చేయటం, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోవటం కూడా ఐఏఎస్ అధికారుల బాధ్యత. ఐఏఎస్‌లకు భిన్న శాఖల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఐపీఎస్‌లకుశాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. దానికి అనుగుణంగా వారికి ప్రత్యేక శిక్షణ అవసరమవుతుంది. అలాగే ఐఎఫ్ఎస్‌లు అడవుల పరిరక్షణలో, భద్రతలో, వాటి నిర్వహణలో అవగాహన పెంచుకుంటారు. పర్యావరణం, వాతావరణ మార్పులు, సహజ వనరుల సంరక్షణ వారి ప్రధానాంశాలు. అందరి అంతిమ ధ్యేయమూ మెరుగైన పాలనా వ్యవస్థను ప్రజల అందుబాటులోకి తీసుకు రావటమే అయినప్పుడు ఎవరికీ ఆధిక్యతా భావన ఉండకూడదు. అటువంటి మనస్తత్వం పాలనపై దుష్ప్రభావం కలిగిస్తుంది. ప్రభుత్వ తీరుతెన్నులపై విమర్శలకు తావిస్తుంది. కానీ దురదృష్టమేమంటే, ధర్మాసనం చెప్పినట్టు చాలాచోట్ల ఇలాంటి పోకడలు కనిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం కర్ణాటకలో ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతల్లోవున్న ఇద్దరు మహిళా అధికారులు సామాజిక మాధ్యమాల్లో ఎలా దూషించుకున్నారో ఎవరూ మరిచిపోరు. అప్పట్లో ప్రధాని కార్యాలయం ఆనాటి ముఖ్యమంత్రిని వివరణ కోరింది. సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తరాఖండ్‌లో అడవుల సంరక్షణ, అభివృద్ధి అవసరాలు సమతౌల్యం చేయటానికి ఉద్దేశించిన నిధులు దుర్వినియోగం కావటానికి సంబంధించి దాఖలైన కేసులో ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులిద్దరి మధ్య తలెత్తిన వివాదం ప్రస్తావనకొచ్చినప్పుడు న్యాయమూర్తులు ఐఏఎస్‌ల తీరును నిశితంగా విమర్శించారు. ఒకచోట పనిచేయాల్సి వచ్చినప్పుడు వివాదాలు తలెత్తటం అసాధారణమేమీ కాదు. కానీ వ్యక్తిగత స్థాయికి వివాదాల్ని దిగజార్చటంవల్ల వ్యవస్థ దెబ్బతింటుంది. చాలా రాష్ట్రాల్లో ఇలాంటి సమస్యలుంటున్నాయి. వీటికి ఎక్కడో ఒకచోట బ్రేక్ పడాలి. తాత్కాలిక సర్దుబాట్లుకాక మరోసారి సమస్య తలెత్తకుండా ఏం చేయవచ్చునో ఆలోచించాలి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పరిచిన అధి కార యంత్రాంగం కాస్తా అంతర్గత కలహాల్లో మునిగితే వ్యవస్థ నష్టపోతుంది. అంకితభావంతో, కర్తవ్యనిష్టతో పనిచేసిన ఎస్.ఆర్. శంకరన్, బి.డి. శర్మవంటివారు ఇవాళ్టికీ చిరస్మరణీయులు. అధికారులకు వారు ఆదర్శం కావాలి. అప్పుడు అహంభావానికి తావుండదు.

# హామీల్లో కోతలు.. రైతులపై వంచన ఒక్కటే రేవంత్‌కు తెలుసు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పాలనలో మహిళలు కోటీశ్వరులు కాదు.. అప్పులపాలయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మిగిలింది ఎడతెగని వేదనే. మహిళలను కోటీశ్వరులను కాదు, కనీసం లక్షాదికారులుగా చెయ్యని చేతగాని సర్కారు మీద అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏడాదిన్నర పాలనలో మహిళలకు ఏం చేసారని నేడు వేడుకలు నిర్వహిస్తున్నారు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏటా 20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. చేసింది గోరంత, చెప్పుకునేది కొండంత అన్నట్లుంది కాంగ్రెస్ తీరు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన సమాధానం ప్రకారం, సుమారు రూ. 5 వేల కోట్ల వడ్డీ లేని రుణాల బకాయి ఉంది. బకాయిలే చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదేళ్లలో లక్ష కోట్ల రుణాలు ఎలా ఇస్తుంది? కాంగ్రెస్ ప్రభుత్వ తీరు వల్ల మహిళలు కోటీశ్వరులు కాదు, అప్పుల పాలయ్యే పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. 'మహిళలకు ప్రతి నెలా రూ. 2500' ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో మొట్ట మొదటి హామీగా చెప్పి ఏడాదిన్నరగా అమలు చేయని రేవంత్ సర్కారు, ఈరోజు ఇందిరా మహిళా శక్తి పేరిట వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు బకాయి పడ్డ రూ. 37,500 ఎప్పుడు చెల్లిస్తారు? రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటితే, చేతలు మాత్రం గడప దాటవు అని మరోసారి నిరూపితమైంది. గ్యారెంటీలు, 420 హామీలు అని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసినట్లే రేవంతు సర్కారు, మహిళలను దారుణంగా వంచించింది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, కేసీఆర్ గారు మహిళా సంక్షేమం, సాధికారత, స్వయం సమృద్ధి కోసం ప్రారంభించిన పథకాలకు మంగళం పాడారు అని హరీశ్‌రావు విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో కేసీఆర్ కిట్టు బంద్ అయ్యింది. కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ బంద్ అయ్యింది. బతుకమ్మ చీరెలు బంద్ అయినయి. ఆరోగ్య లక్ష్మి బంద్ అయ్యింది. ఆరోగ్య మహిళ బంద్ అయ్యింది. పింఛన్ల పెంపు బంద్ అయ్యింది. కడుపు కోతలు మల్లా పెరిగినయి. పెరిగిన క్రైం రేటుతో ఆడబిడ్డలకు భద్రత కరువైంది. నోటిఫికేషన్లు రాక, యువతుల ఉద్యోగ కలల సాకారం ప్రశ్నార్థకమైంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకుండా ఇన్నాళ్లూ కాలం వెల్లదీసారు. ఇప్పుడేమో అన్నీ చేసినట్లు, మహిళలను కోటీశ్వరులను చేసినట్లు కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం, అధికారంలోకి వచ్చాక అబద్దాలు ప్రచారం చేసుకుంటం అన్నట్లుంది కాంగ్రెస్ వైఖరి అని హరీశ్‌రావు మండిపడ్డారు. మీ అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పి, ఏడాదిన్నరగా మాట తప్పిన హామీలను గుర్తు చేస్తున్నాను. మహాలక్ష్మి కింద ప్రతి మహిళకు నెలకు రూ. 2500. ఇప్పటికీ అమలు లేదు. సంవత్సరానికి 20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తమన్నరు. అతీగతీ లేదు. 18 ఏళ్లు పైబడి, చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తమన్నరు. ఊసే లేదు. ఆడబిడ్డ పెళ్లికి లక్ష ఆర్థిక సాయంతో పాటు, తులం బంగారం ఇస్తామన్నరు. జాడే లేదు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రంతో పాటు, ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తమన్నరు. పత్తాలేదు. డ్వాక్రా సంఘాలకు పక్కా భవనాలు నిర్మిస్తం అన్నరు. ప్రస్తావన లేదు. పుట్టిన ప్రతి ఆడ బిడ్డకు ఆర్థిక సాయంతో కూడిన 'బంగారు తల్లి' పథకాన్ని పునరుద్దరిస్తం అన్నరు. పథకమే లేదు. అంగన్‌వాడీ టీచర్లకు నెలసరి వేతనం 18,000 లకు పెంచుతూ, ఇపిఎఫ్ పరిధిలోకి తెచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తం అన్నరు. ఆలోచనే లేదు. ఆశా వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచుతం అన్నరు. సోయి లేదు. ఇందులో ఒక్క హామీని అమలు చేయకుండా, నేడు వేడుకలు జరుపుకోవడం నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుందని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## ఎంపీల సమావేశంలో డిప్యూటీ సీఎం కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

మెట్రో రెండో దశ, మూసీ రివర్ అభివృద్ధి ప్రాజెక్ట్, బేపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం సహా పలు ప్రధాన అంశాలను అందులో పొందుపర్చారు. వీటికి కేంద్రం అనుమతులు, నిధులు మంజూరు చేసేలా తెలంగాణ ఎంపీలు పావులు కదపనున్నారు. ఈ సమావేశానికి ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సహా కాంగ్రెస్ ఎంపీలు కాగా.. బీఆర్ఎస్, బీజేపీ ఎంపీలు మాత్రం గైర్హాజరయ్యారు. సమావేశానికి రావాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించినప్పటికీ ముందే ఖరారైన షెడ్యూల్ కారణంగా వారిద్దరూ హాజరు కాలేదు. ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ఆమోదం, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ రేడియల్ రోడ్ల అభివృద్ధి. మెట్రో రెండో దశ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్ట్, బేపు ఘాట్‌ను గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేయడం. గోదావరి-మూసీ నది లింక్ ప్రాజెక్ట్, హైదరాబాద్ కోసం మురుగునీటి పారుదల మాస్టర్ ప్లాన్. వరంగల్ భూగర్భ డ్రైనేజీ ప్రణాళిక, బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ సమీపంలోని డ్రై పోర్టు వరకూ గ్రీన్‌ఫీల్డ్ హైవే. ఎస్‌సీసీఎల్ కోసం బొగ్గు బ్లాకుల కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్, ఐపీఎస్ కేడర్ సమీక్ష.పీఎస్‌డీఎఫ్ కింద పథకాల మంజూరు, పీఎం కుసుమ్-ఏ, బీ, సీ కింద కేటాయింపు. తాడిచెర్ల బొగ్గు బ్లాక్-మైనింగ్ లీజు, వివిధ కార్పొరేషన్లు/ఎస్?పీవీల రుణ పునర్నిర్మాణం. వర్తించే ఇంటర్‌తోకి చెల్లించాల్సిన మొత్తాన్ని తిరిగి చెల్లించమని విజ్ఞప్తి. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కిందకి చెల్లించాల్సిన గ్రాంట్ విడుదల కోసం అభ్యర్థన. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సీఎస్ఎస్ నిధుల విడుదలలో లోపాన్ని సరిదిద్దమని అభ్యర్థన. ఏపీబిల్డింగ్, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు, కార్మిక సంక్షేమ నిధిలో తెలంగాణకు వాటా కోసం నిధులను బదిలీ చేయాలని అభ్యర్థన. ఏపీ పవర్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన మొత్తానికి సంబంధించి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి, రాష్ట్రంలో రైళ్ల కనెక్టివిటీ పెంచాలని విజ్ఞప్తి. ఖమ్మంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, వెనకబడిన ప్రాంతాలలో రోడ్డు కనెక్టివిటీని మెరుగుపరచడం. పీఎం మిత్రా పార్క్ పథకం కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు. అన్‌కవర్డ్ జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు తదితర నిర్ణయాలు తీసుకున్నారు.

## కుటుంబ వ్యవస్థను నడిపించడంలో మహిళ పాత్ర కీలకం

మొదటి పేజీ తరువాయి

ఎన్నో కష్టాలను అధిగమిస్తూ పురుషుడితో సమానంగా నేటి సమాజంలో స్త్రీ పోశిస్తున్న పాత్ర అమోఘమని తెలిపారు. అవకాశాలిస్తే అబల సబలగా నిరూపించుకుంటుందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర మహిళాభ్యున్నతికోసం అమలు చేసిన పలు కార్యక్రమాలు వారి సాధికారతకు దోహదం చేయాశయని కేసీఆర్ గుర్తుచేశారు. మహిళల ఆరోగ్యం, సంరక్షణ, సంక్షేమం తో పాటు పలు కీలక అభివృద్ధి పథకాలల్లో మహిళకే ప్రాధాన్యతనిచ్చామన్నారు. వారి కేంద్రంగానే పథకాలను అమలు చేశామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రగతిలో మహిళలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం భాగస్వామ్యం చేసిందన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మహిళాసాధికారతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. వారిని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు.

## మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

మొదటి పేజీ తరువాయి

ప్రతీ మహిళకు రూ.2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కిరాయికి తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదని విమర్శించారు. మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని వెల్లడించారు. మహిళల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా, పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని వెల్లడించారు. అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందన్నారు. 'సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు, గౌరవం, నిర్ణయాధికారం రావాల్సి ఉంది. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణం. మహిళలకు కులమతాలు లేవు.. మహిళలది ఒకే కులం. మహిళలలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలి. ఇళ్లలో మహిళలు ద్వితియ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలి. అమెరికాలో 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే, భారత్‌లో మాత్రం అది 17 శాతంగానే ఉంది. దేశంలో 50 శాతం మహిళలు ఉద్యగాలు చేస్తే దేశ జీడీపీకి మనం 5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతాం. కానీ మహిళలు ఉద్యోగాలు చేయదగడానికి గల సౌకర్యాలు ఉన్నాయా అన్నది ఆలోచించాలి. భూగర్భ గనులల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారు. అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి. వాటిని అధిగమించాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు.

## రాష్ట్రంలో మొదలైన విద్యుత్ కోతలు : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మొదటి పేజీ తరువాయి

ఈ కారణంగా అటు అన్నదాతలు, ఇటు పరిశ్రమల వారితో పాటు సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ కోతలపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తీవ్రంగా స్పందించారు. ఈ రోజు హైదరాబాద్‌లో నేనుండే బండ్లగూడ ఏరియాలో రెండు గంటల్లో ఆరు (6) సార్లు కరెంటు పోయింది!! రేవంత్ గారు.. మీరు కోతలు-ఎగవేతల సీఎం కాకపోతే మరేంది? అని ప్రశ్నించారు. మీ పాలనంతా అంధకారమే అని సీఎం రేవంత్ రెడ్డిని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇక కేసీఆర్ పాలనలో 24 గంటల నిరంతర కరెంటుతో పదేండ్ల పాటు గుండెలపై చెయ్యేసుకొని కంటి నిండా నిద్రపోయిన రైతన్నకు.. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది రేవంత్ సర్కార్. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే వ్యవస్థలన్నీ అస్తవ్యస్తం కావడంతో ఓవైపు భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు కరెంటు కోతలతో పంటలకు నీళ్లందక పచ్చని పొలాలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో తెలంగాణ రైతాంగం ఉండిపోయింది. కడుపుమండి అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు.

## మహిళలంటే సమాజంలో చిన్నచూపు

మొదటి పేజీ తరువాయి

ఎదుగుదల గుర్తింపు కోసం అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు కష్టాలు అధిగమించి ముందుకు వెళుతున్నారు.. మహిళల భద్రత తమ బాధ్యత అని అన్నారు. మంత్రి సీతక్క ఎన్నో ఒడిదొడుకులు ఎదురుకుని ఈరోజు మన ముందు మంత్రిగా నిలబడ్డారని చెప్పారు. మహిళలు, అమ్మాయిల కోసం సిటి పోలీస్ / షీ టీమ్స్ ఎన్నో భద్రత చర్యలు తీసుకున్నాయని తెలిపారు. మహిళల భద్రత, శాంతి భద్రతలు కాపాడడంలో తాము రాజీపడమని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పాల్గొన్నారు.

కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం మార్చి 09 2025

# జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలి

- మహిళా చట్టం అమలు చేయకపోవడంతో రాజకీయంగా నష్టపోయితున్న మహిళలు...
- కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే...
- మహిళలకు నెలకు 2500 ఇచ్చే వరకు కాంగ్రెస్ ను వెంటాడుతాం...
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత...
- తెలంగాణ భవన్ లో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత...







**కబురు న్యూస్,హైదరాబాద్,మార్చ్ 08 :**
జనగణనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదించినప్పటికీ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని జనగణనతో ముడిపెట్టి కేంద్రం ఇప్పటికీ అమలు చేయడం లేదని, దాంతో దేశవ్యాప్తంగా మహిళలు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమల్లో లేనందువల్ల ఇటీవల ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర,ఢిల్లీ,హర్యాన వంటి రాష్ట్రాల్లో చాలా మంది మహిళలు ఎమ్మెల్యేలుగా కాలేకపోయారని,త్వరగా జనగణన చేస్తే రాబోయే బిహార్,తమిళనాడు వంటి రాష్ట్రాల్లో మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలవుతారని అభిప్రాయపడ్డారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్ లో జరిగిన వేడుకలకు ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు,కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు.ఈ సంవర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ప్రతి మహిళకు రూ 2500 ఇస్తామన్న హామీని అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు.మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలను స్వాగతిస్తున్నామని,అయితే మహిళలను ఎలా కోటీశ్వరులను చేస్తారో నిర్దిష్టమైన ప్రణాళికను ప్రభుత్వం ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు.మహిళా సంఘాల ద్వారా అద్దెకు తీసుకుంటున్న బస్సులకు ఆర్టీసీ సకాలంలో కిరాయి చెల్లిస్తుందా లేదా స్పష్టత ఇవ్వాలి,అంగన్ వాడీ, ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం సరికాదని,తక్షణమే వారికి జీతాలను పెంచాలని సూచించారు.బీఆర్ఎస్ పార్టీ హయాంలో కేసీఆర్ మహిళా కేంద్రీకృత పాలన చేశారని,మహిళల కోసం కేసీఆర్ అనేక పథకాలు, కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు.కేసీఆర్ పెట్టిన పథకాలను తీసేసే కర్కోటక ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని ధ్వజమెత్తారు. కేరళ ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో మహిళా,పురుషుల సమానత్వపు బొమ్మలు ప్రచురిస్తున్నారని,అలాంటి చర్యలు తెలంగాణలో కూడా రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.కాగా,సమాజం ఎదుగుదలలో మహిళల పాత్ర గణనీయమని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళలకు సమాన హక్కులు,గౌరవం,నిర్ణయాధికారం రావాల్సి ఉందని,అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. చిట్యాల ఐలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీర మహిళలు తెలంగాణ గడ్డపై పుట్టడం మనకు గర్వకారణమని అన్నారు. మహిళలకు కులమతాలు లేవని, మహిళలది ఒకే కులమని, మహిళలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని తెలిపారు.ఇండ్లల్లో మహిళలు ద్వితియ శ్రేణి పౌరులుగా ఉంటున్నారన్న వాదన వీగిపోవాలని చెప్పారు. అమెరికా 40 శాతం మహిళలు ఉద్యోగాలు చేస్తుంటే భారత్ లో మాత్రం అది 17 శాతంగానే ఉందని,దేశంలో 50 శాతం మహిళలు ఉద్యగాలు చేస్తే దేశ జీడీపీకి మనం 5 లక్షల కోట్ల ఆదాయం ఇవ్వగలుగుతామని వివరించారు. కానీ మహిళలు ఉద్యోగాలు చేయదగడానికి గల సౌకర్యాలు ఉన్నాయా ? అన్నది ఆలోచించాలని, ముఖ్యంగా పని ప్రదేశంలో టాయిలెట్ వంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. భూగర్భ గనుల్లో పనిచేయడం నుంచి అంతరిక్షంలోకి వెళ్లే వరకు మహిళలు ఎదిగారని,అయినప్పటికీ అయినా అనేక అవాంతరాలు ఉన్నాయి.వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ కవిత అభిప్రాయపడ్డారు.

## లబ్ధిదారులకు విశ్వకర్మ కిట్లను అందజేసిన బిజెపిపట్టణ అధ్యక్షుడు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**
బాన్సువాడ మండలంలో ఇబ్రహింపేట్ గ్రామానికి చెందిన మత్స్యకారులు హన్మాండ్లు,సాయిలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకంలో దరఖాస్తు చేసుకోగా శనివారం మంజూరైన కిట్లను బిజెపి పట్టణ అధ్యక్షుడు తుప్తి ప్రసాద్ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కులవృత్తులకు చేయూతను అందించేందుకు పీఎం కిసాన్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టి కులవృత్తులను కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహిళ పోలీస్ ఉద్యోగులను సత్కరించిన బిజెపి నాయకులు



**కబురు న్యూస్ నసురుల్లాబాద్ మార్చి 8**
నసూరుల్లాబాద్ మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులైన ఎస్సై లావణ్య, కానిస్టేబుల్ లకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సున్నం సాయిలు మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలలను సత్కరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, నాయకులు శ్రీనివాస్, యాదగిరి గౌడ్, నారాయణ, అనిల్,రవి, హన్మాండ్లూ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బాన్సువాడ లో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**



ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బాన్సువాడ బిజెపి శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు, బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో బాన్సువాడ ఆర్టీసీ డిపోలో మహిళ ఉద్యోగులు, ఓంశాంతి సభ్యులను, డిపో మేనేజర్ సరితా దేవిని బిజెపి నాయకులు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని, కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళల కొరకు 33% రిజర్వేషన్ను కల్పించడం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగ్యసామ్యం మరింత పెరిగి, దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సరిత దేవి,అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు తుప్తి ప్రసాద్ బీజేపీ నాయకులు మోహన్ రెడ్డి కొనాల గంగారెడ్డి, చీకట్ల రాజు, చిరంజీవి, వెంకట్ శంకర్ రామకృష్ణ, సాయి రెడ్డి, కార్యకర్తలు, ఆర్టీసీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

## బీర్కూరులో మహిళా పోలీసు ఉద్యోగులను సత్కరించిన భాజపా నాయకులు

**కబురు న్యూస్ బీర్కూరు మార్చి 8**




బీర్కూర్ మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని బిజెపి మండల అధ్యక్షుడు నాగేల్ల సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ సీతారామమ్మ, మహిళ ఉద్యోగులను శాలువతో ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం 33% రిజర్వేషన్లు కల్పించడంతోపాటు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రధానమంత్రి ముద్ర యోజన, లక్పతి దీదీ, ఉజ్వల యోజన, బేటి బచావో బేటి పడావో కార్యక్రమాల ద్వారా మహిళల అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయికిరణ్, యోగేష్, హన్మాండ్లు, సాయిబాబా, బసవరాజ్, శ్రీనివాస్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వాసవి పాఠశాల విద్యార్థిని తపస్వి

**– రాష్ట్రస్థాయికి ఎంపికైన వాసవి పాఠశాల విద్యార్థిని తపస్వి**

కబురు న్యూస్ బాన్సువాడ, మార్చి 08
విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేందుకు చిన్ననాటి నుండి వారికి మెలకువలు శిక్షణ అందిస్తూ మరోసారి తమ పాఠశాల పేరును జిల్లా స్థాయిలో ఈనాడు నిర్వహించిన ప్రతిభ పాఠవ పోటీలలో కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని తపస్వి మరోసారి నిరూపించింది. ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులకు శనివారం నిజామాబాద్ నిషిత డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించాగా ఉపన్యాస పోటీల్లో బాన్సువాడ పట్టణంలోని వాసవి హైస్కూల్ కు చెందిన విద్యార్థిని యండమూరి తపస్వి 'మానవ సంబంధాలు.. విలువలు'పై ఆంగ్లంలో విపులంగా ఉపన్యాసం చేసి జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. హైదరాబాద్ లోని రామోజీ ఫిలింసిటీలో జూన్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో తపస్వి పాల్గొననుంది. గురువుల ప్రోత్సాహంతోనే...తపస్వి




వాసవి పాఠశాల గురువుల ప్రోత్సాహంతోనే చదువుల్లో రాణిస్తూ ఉపన్యాస పోటీల్లో బహుమతి అందుకోవడం ఆనందంగా ఉంది. పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను అర్థమయ్యేలా బోధించడమే కాకుండా జనరల్ నాలెడ్జ్ పై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి అందుకోవడం పట్ల విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



**విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చి దిద్దడమే మా లక్ష్యం...**

చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించడానికి చక్కటి శిక్షణ అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలని ప్రిన్సిపల్ శ్వేత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాసవి పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని విభాగాల్లో నైపుణ్యం సాధిస్తున్నారు. ఈనాడు నిర్వహించిన ప్రతిభ పాఠవ పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని తపస్వి ద్వితీయ బహుమతి సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

## సమానత్వం కోసం ఉద్యమించాలి

**కబురు న్యూస్, నిజామాబాద్ మార్చి 08 :**
స్త్రీ లేనిదే జననం లేదు,స్త్రీ లేనిదే సృష్టి లేదని అలాంటి స్త్రీ నేటికీ సమానత్వాన్ని అందుకోలేకపోతున్నదని,ఆమె పట్ల ఆధునిక యుగంలోనూ అడుగడుగునా అవమానం వివక్షత కొనసాగుతున్నదని విద్యావేత్త డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు.తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో శనివారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.మహిళలు తమకు ఓటు హక్కు కావాలని,సమాన పనికి సమాన వేతనం, పని గంటలు తగ్గించాలని పోరాటం చేసిన ఫలితంగా మహిళా దినోత్సవం వచ్చిందని ఆయన అన్నారు.జిల్లా నాయకులు ఈ.వి.ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జన విజ్ఞానవేదిక నాయకులు విజయానందరావు మాట్లాడుతూ,మహిళలు అంటే కేవలం వంటింటికే పరిమితం కాదని,అనేక రంగాల్లో తాము సైతం మగ వారితో సమానంగా రాణిస్తున్నారని అన్నారు.జిల్లా నాయకులు నరేందర్ మాట్లాడుతూ ఆమె అడుగడుగునా అవమానాలను ఎదుర్కొంటుందని,శతాబ్దాల కాలంగా సమానత్వ సాధనకై వివిధ ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళలు సాధించిన విజయానికి ఇది ప్రతీకని అంతర్జాతీయంగా ఏంతో ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు.మనదేశంలో మహిళలకు నాటి నుండి నేటిదాకా పనికి గుర్తింపు,విలువ కట్టని సమాజం ఉందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పలువరు మహిళలను ఘనంగా సన్మానించారు.ఈ సమావేశంలో పుష్పవల్లి,దీన సుజాన,స్వర్ణలత,ఎలిజిబెత్,కళావతి, శిర్ప హనుమాన్లు,ఎస్ ప్రసాదరావు,భోజారావు,రామ్మోహన్,మదన్ మోహన్,తదితరులు పాల్గొన్నారు.




## ఇంటర్ సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,మార్చి 08 :**
మార్చి 10వ నుండి ఇంటర్ సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యా ఆధికారి తిరుమలపుడి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్ జిల్లా విద్య అధికారి కార్యాలయం లోని మూల్యాంకన కేంద్రంలో సంస్కృతం బోధించే అధ్యాపకులు అందరూ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అన్ని ప్రైవేట్ కళాశాలలో సంస్కృతం బోధిస్తున్న



అధ్యాపకులు వెంటనే తమ కాలేజ్ లాగిన్ ల నుండి నియామక పత్రాలను ప్రింట్ తీసుకొని పదవ తేదీన మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులను వెంటనే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు రిలీవ్ చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు.సంస్కృతం బోధించే అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయని కళాశాలల కరస్పాండెంట్,ప్రిన్సిపాల్ లపై ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**
బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర్ కాలనీకి చెందిన ప్రైవేట్ డ్రైవర్ సురేందర్ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాది రమాకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం... కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**

సమయాన్ని, డబ్బును వృధా చేసుకోకుండా సత్వర పరిష్కారం కోసం పరస్పర రాజి మార్గమే రాచమార్గమని కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ ద్వారా బాన్సువాడ బిచ్కుంద ఎల్లారెడ్డి పరిధిలోని కోర్టులకు సంబంధించిన సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు, తదితర కేసులకు 590 కేసులు లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం అయ్యాయని వాటి ద్వారా 19,76870 రూపాయలు పరిష్కారం చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు రమాకాంత్ రావు, భూషణ్ రెడ్డి, ఖలీల్, మోహన్ రెడ్డి, హమీద్,మొగులయ్య అజీమ్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ద్యేయం... ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి..



**కబురు న్యూస్,బోధన్ మార్చి 08..**



మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ద్యేయమని మాజీ మంత్రి,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో అధికారికంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. మహిళలకు పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు అందించారు. ముందుగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తో కలిసి కేక్ కట్ చేసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బోధన్ పట్టణ, మండలంలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు మంజూరైన 150 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, తహసిల్దార్ విఠల్, ఏసీపీ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల విద్యార్థినీల రక్షణకై కఠిన చట్టాలు అమలు కావాలి

**– జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ ప్రెస్ క్లబ్,మార్చి 08 :**




అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుంటూ ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ప్రెస్ క్లబ్ లో సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్ లో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా ప్రముఖ మహిళ నారీమణులను ఆహ్వానించారు.నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్,ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వీరలక్ష్మి,సీతాదేవి,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ను ఆహ్వానించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ,మహిళలకు రక్షణకు సంబంధించి కరాటే శిక్షణ ఇస్తున్నటువంటి మాస్టర్ ల ధ్వారా సలహాలు,సూచనలు,అదేవిధంగా మహిళల విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని,సమాజంలో అంతా త్వరగా ఎవరిని నమ్మి మోసపోవద్దని కష్టాల్ని ఇష్టాలు చేసుకొని సమయపాలన పాటించి చదువును కొనసాగించినట్లయితే అనుకున్న లక్ష్యాన్ని చేకూరుతారని వారు సందేశాలు అందించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కమిటీ గర్ల్స్ అధ్యక్షురాలు మేఘన,సహాయ కార్యదర్శి అప్పు,ఉపాధ్యక్షురాలు వల్లి,అదేవిధంగా కోశాధికారి ప్రవళిక,విద్యార్థులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 08 :**

యాత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తంత్ర దేవతా మార్చి 8 ఒక చారిత్రాత్మక ప్రాధాన్యత గల రోజు విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని రెడ్ క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు అన్నారు.శనివారం నగరంలోనో ఖలీల్ వాడి లో రెడ్ క్రాస్ లో సేవలు అందిస్తున్న మహిళా ఉద్యోగులకు గణసత్కారం చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అమ్మగా మనకు జన్మనిచ్చి,అక్కగా,చెల్లిగా ప్రేమను పంచి భార్యగా తన జీవితాన్నే ధారపోసి,బిడ్డగా అనురాగం పంచుతూ,వివిధ వృత్తులలో,వివిధ రంగాలలో అన్నిట్లో చేదోడువాదోడుగా రాణిస్తున్నారు,భారతదేశంలో స్త్రీలను కాచుకోవడంలో చట్టాలను మించినవి మరేవీ కానరావన్నారు.భారతీయ సంవిధానంలోని ప్రతి అంశం కూడా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ రూపుదిద్దుకుందన్నారు.ఈ విషయమై మహిళలు సంపూర్ణమైన అవగాహనను కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ ,కోశాధికారి కరిపే రవీందర్,జిల్లా కార్యదర్శి గోక అరుణ్ బాబు,నిజామాబాదు డివిషనల్ చైర్మన్ డా.శ్రీశైలం,బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా.రాజేష్ ,పీ.ర్.ఓ బొద్దుల రామకృష్ణ,రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల సదన్ లో బార్ అసోసియేషన్ అధ్యక్షుని జన్మదిన కార్యక్రమం




**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,మార్చ్ 08 :**



బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ జన్మదిన సందర్భంగా నగరంలోని బాల సదన్ లోని బాలికల మధ్యన జన్మదిన కార్యక్రమం జరపడం జరిగింది.ముఖ్య అతిథిగా విచ్చేసిన లీగల్ హెడ్ చీఫ్ రాజ్ కుమార్ సుబేదార్ మాట్లాడుతూ,సౌమ్యుడు,మృదు స్వభావి అయినా జగన్ అందర్నీ కలుపుకోబోతూ ఈరోజు న్యాయవాద అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం వారి జన్మదిన సందర్భంగా పిల్లల మధ్య జరుపుకోవడం శుభ పరిణామం అని విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి స్థాయిలో రాణించాలని తెలిపారు.అనంతరం ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ,విద్యార్థులకు పండ్లు,బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది.అనంతరం బార్ అసోసియేషన్ లో న్యాయవాదులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జగన్మోహన్ గౌడ్ వసంతరావు విగ్నేష్ లక్ష్మణ్ పిల్లి.శ్రీకాంత్ సుజిత్ నాగ సురేష్ ప్రకాష్ యనిఎస్ ఖాన్ గోవర్ధన్ జైపాల్ అయ్యూబ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులను సత్కరించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**

బాన్సువాడ పట్టణంలోని మార్కెట్ కమిటీ, పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళ ఉద్యోగులను శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మార్కెట్ కమిటీ చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని వారిని ప్రోత్సహించి ముందుకు నడిపించినట్లయితే రాజకీయాల్లో తమ వంతు పాత్ర పోషించేందుకు ముందుకు వస్తారని, తనకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవి కూడా మహిళగా అవకాశం కల్పించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్, జిల్లా ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్, మాజీ కౌన్సిలర్ బాడీ శ్రీనివాస్, సాయిలు, మోసిన్, వడ్ల రాజు, మహిళ ఉద్యోగులు , మార్కెట్ కమిటీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు



## హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహొత్సవంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**



బాన్సువాడ పట్టణంలోని గౌలిగూడలో హనుమాన్, రుక్మిణి విఠలేశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహొత్సవంలో భాగంగా శనివారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ముఖ్యదేవతల హొమాదులు, షాయదివాసం, పుష్ప దివాసం పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ కాలనీలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**



బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీలో సిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పలు రంగాల్లో రాణించిన వారి జీవిత విశేషాలను చర్చించుకొని, అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళ్లేందుకు ప్రోత్సహించేందుకు తమ వంతు పాత్ర పోషిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## నిధులు మంజూరు చేయాలని ఎంపీ అరవింద్ కు వినతి...



**కబురు న్యూస్, బోధన్ మార్చి 08...**



బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండల కేంద్రంలోని బ్రాహ్మణ వైకుంఠ ధామం ప్రహరీగోడ నిర్మాణానికి, రజక సంఘం కమ్యూనిటీ భవనం కొరకు ఎంపీ నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కందగట్ల రాంచందర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఇందూర్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ కు వినతి పత్రం అందజేశారు. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి తో కలిసి బీజేపీ నాయకులు ఎంపీ అరవింద్ కు కోరారు. దీంతో ఎంపీ సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారని తెలిపారు. మల్లెపూల శ్రీనివాస్, గంగాధర్, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు శ్రీపాద శర్మ బంటు వైద్య, రాంగోపాల్ హనుమాండ్లు, బీజేపీ బోధన్ మండల ప్రధాన కార్యదర్శి జిల్కరి ప్రవీణ్, నాయకులు సిర్ప సుదర్శన్, బూత్ అధ్యక్షులు తోట సురేష్, బీజేపీ నాయకులు అరే పవన్, నీరడి బాబురావు తదితరులు ఉన్నారు.

## కోర్టు జడ్జిని సత్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు




**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణమూర్తి ఆధ్వర్యంలో సివిల్ కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి ని శాలూవాతో సత్కరించి మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మూర్తి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందడంతోపాటు, చట్టాలపై అవగాహనతో పాటు సమాజం అభివృద్ధి చెందేందుకు ఎంతో కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు రమాకాంత్ రావు, భూషణ్ రెడ్డి,మోహన్ రెడ్డి, ఖలీల్, హైమద్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య మహిళ కార్మికులకు సత్కారం..



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**

బాన్సువాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులకు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని, పట్టణాన్ని అందంగా, పారిశుద్ధ్యన్ని సక్రమంగా ఉంచడంలో కూడా మహిళా కార్మికుల పాత్ర ఎంతో ఉందని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, సాయిబాబా, గౌస్, కార్యకర్తలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.... జడ్జి టిఎస్పి భార్గవి



**కబురు న్యూస్ బాన్సువాడ మార్చి 08**

చట్టాలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ఒకరిపై ఒకరు కేసులు చేసుకొని సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవడం ద్వారా ఎంతో విలువైన సమయాన్ని కోల్పోవడం జరుగుతుందని కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి అన్నారు. శనివారం బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవ అధికారిక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చట్టాల్ని గౌరవించాలని చట్టాల్ని చేతిలోకి తీసుకోవడం ద్వారా శిక్షారులు అవుతారని, చిన్ననాటి నుండి ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నట్లయితే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఏజిపి లక్ష్మీనారాయణ మూర్తి, న్యాయవాదులు రమాకాంత్ రావు, మోహన్ రెడ్డి, ఖలీల్, హైమద్, మొగులయ్య, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ పాఠశాలను అడ్డుకుంటున్న సుదర్శన్ రెడ్డి

- కాంగ్రెస్ ఎమ్మెల్యేల పని నేనే చేస్తున్నాను...
- ఎన్ఎస్ఎఫ్ భూములు ప్రైవేట్ వి..ఆ భూములు ఎలా ఇస్తారు?
- మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ,ఎంఐఎం మధ్యే పోటీ...
- ఎంపి అరవింద్ ధర్మపురి...





**కబురు న్యూస్,నిజామాబాద్ మార్చి 8 :** తెలంగాణకు 7 నవోదయలు మంజూరైతే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి 2 నవోదయలను తీసుకొచ్చానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా మధ్యలో ఉండాలనే ఉద్దేశంతో జక్రాన్ పల్లి మండలం కలిగోట్ వద్ద నవోదయ ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అడ్డుకుంటున్నారని విమర్శించారు.తమ పార్టీ ఎమ్మెల్యేలు రాకేశ్ రెడ్డి,ధన్ పాల్ సూర్యనారాయణను ఒప్పించి,కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియోజకవర్గమైన నిజామాబాద్ రూరల్ పరిధిలో పెడుతున్నామన్నారు.నవోదయ ఏర్పాటుపై సీఎం రేవంత్ తో,జక్రాన్ పల్లి ఎయిర్ పోర్టుపై కేంద్ర విమానాయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడనని,కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేయాల్సిన పనులు తానే చేస్తున్నానని అర్వింద్ అన్నారు.రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఏం చేస్తున్నాడో అర్థం కావడం లేదని,తాను తీసుకొచ్చిన ప్రాజెక్టులను సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. నిజాం షుగర్స్ ను తెరవనీయుడు.జక్రాన్ పల్లి మండలం కలిగోట్ లో నవోదయ ఏర్పాటుకు స్థానిక తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్,రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రతిపాదలను సిద్ధం చేస్తే,సుదర్శన్ రెడ్డి వాటిని మార్చి పంపించారని అర్వింద్ అన్నారు.ప్రైవేట్ భూములైన నిజాంషుగర్స్ భూములను నవోదయకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరవదా? అని ప్రశ్నించారు.మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న సుదర్శన్ రెడ్డి నిజాంషుగర్స్ ను తెరవకుండా చేసి సొంతంగా ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.నిజాంషుగర్స్ భూములను నవోదయకు ఇచ్చే అవకాశం లేదని అధికారులు ఒక దిక్కు చెబుతున్నా,వారి మాటలను పెడచెవిన పెట్టిన సుదర్శన్ రెడ్డి కేవలం నవోదయను అడ్డుకోవడం,నిజాంషుగర్స్ ను తెరవకుండా చేయడం లక్ష్యంగా కేంద్రానికి ప్రతిపాదనలను మార్చి పంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దిగజారుడు రాజకీయాలు చేసే సుదర్శన్ రెడ్డికి హెూం మినిస్టర్ పదవి కావాల్నా..? అని ఎద్దేవా చేశారు.ప్రతి అధికారిని,నాయకులు,కార్యకర్తలను, సాధారణ ప్రజలను మతం పేరుతో తిట్టడమే సుదర్శన్ రెడ్డి పనిగా పెట్టుకున్నారన్నారు.సుదర్శన్ రెడ్డి వంటి వ్యక్తిని నమ్ముకుని నట్టేట మునుగొద్దని సీఎం రేవంత్ కు హితవు పలికారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ,ఎంఐఎం మధ్యే పోటీ ఉంటుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు.జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.జిల్లా కేంద్రంలోని స్టేడియంను సుదర్శన్ రెడ్డి నాశనం చేశాడన్నారు.జిల్లా కేంద్రంలో స్టేడియం లేకుండాపోయిందని అన్నారు.ముస్లిం ఓట్ల కోసమే బోధన్ లో నవోదయ పెట్టాలని సుదర్శన్ అంటున్నాడన్నారు.కాంగ్రెస్ కు స్థానిక సంస్థలతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో సీట్లు గెలిచే పరిస్థితి లేదని,ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ విషయం తేటతెల్లమైందన్నారు.నిజామాబాద్ జిల్లాలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి 85శాతం ఓట్లు వచ్చాయని అన్నారు.కాంగ్రెస్ నాయకులు జెడ్పీటీసీ,ఎంపీటీసీ టీకెట్ల కోసం నన్ను తిడుతున్నారు.మీకు టికెట్ లు వచ్చినా గెలిచే పరిస్థితి లేదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.తమ పార్టీ టికెట్లకు తీవ్ర పోటీ ఉందని అర్వింద్ పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి తదితరులున్నారు.

## ట్రాన్స్ పోర్టు కార్యాలయం చోరికి పాల్పడిన దోంగల పట్టివేత



**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,మార్చి 08 :** నిజామాబాద్ నగరంలోని మూడవ టౌన్ పరిధిలోని నాందేవ్ వాడలో సాయి బాలాజీ ట్రాన్స్ పోర్టులో చోరికి పాల్పడిన దొంగలను నలబై ఎనిమిది గంటలలో పట్టుకున్నట్టు నిజామాబాద్ ఏసిపి రాజా వేంకట్ రెడ్డి తెలిపారు.నిజామాబాద్ ఏసిపి కార్యాలయంలో శనివారం ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఏసిపి మాట్లాడుతు,ఈ నెల 6న తెల్లవారు జాము ప్రాంతంలో నాందేవ్ వాడలోని సాయి బాలాజీ ట్రాన్స్ పోర్ట్ లో దోంగలు తలుపు తాళం ధ్వసం చేసి బీరువాను బద్ధలుకోట్టి అందులోని రు.10 లక్షలను ఎత్తుకేళ్లారు. ట్రాన్స్ పోర్టు యాజమాని ఇచ్చిన పిర్యాదు మేరకు నగర సిఐ రాజశేఖర్ రాజు, స్థానిక ఎస్ఐ హరిబాబు, సిసిఎస్ సిఐ సురేష్ , రవిందర్ ల అధ్వర్యంలో దోంగల కోసం వేట సాగించారు. శనివారం ఉదయంనగరంలోని దుబ్బ బైపాస్ రోడ్డులోని వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో నాగారం దోడ్డి కోమురయ్య కాలనికి చెందిన షేక్ సాదక్ అలియాస్ సాధిక్ ( 14 చోరి కేసులలో నిందితుడు), సురేకర్ ప్రకాష్ ( 4 చోరి కేసుల నింధితుడు), సాయినాథ్ విఠల్ రావు (3 చోరిల కేసుల నిందితుడు) నాగారంలోని 50 క్వార్టర్స్ కు చెందిన సయ్యద్ సాదుల్లా( 15 దోంగతనల కేసులో నిందితుడు) అనుమానస్పధంగా వెలుతుండగా పట్టుకుని విచారించడంతో ట్రాన్స్ పోర్టు ఆఫీస్ దోంగతనం కేసు కోలిక్కి వచ్చింది. వారినుంచి రూ.10 లక్షల 17,500 నగధు,ఆటోను స్వాధినం చేసుకున్నారు.నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసిపి తెలిపారు.

## ఇద్దరు దొంగలు అరెస్టు




- బంగారు గోలుసులు స్వాధినం...

**కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,మార్చి 08 :** నిజామాబాద్ నగరంలోని నాల్గవ టౌన్ పోలిస్ స్టేషన్ పరిధిలో,మాక్లూర్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో,నిర్మల్ జిల్లా బాసర పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ లకు,నిర్మల్,అదిలాబాద్ జిల్లాలో బైక్ దోంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఇద్ధరు దోంగలను పట్టుకున్నట్టు నిజామాబాద్ ఏసిపి రాజా వేంకటర్ రెడ్డి తెలిపారు.శనివారం ఏసిపి కార్యాలయంలో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు,గతేడాది డిసెంబర్ 12న నిజామాబాద్ నగరంలోని బోర్గాం( పి) కి చెందిన దుమాల లక్ష్మిబాయి ఓంటరిగా నడుచుకుంటు వేళుతుండగా ఇద్ధరు వ్యక్తులు బైక్ పై వచ్చి గోలుసు తెంపుకేళ్లారని పిర్యాదు చేసినట్లు ఏసిపి తెలిపారు.బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యప్తులో భాగంగా నాల్గవ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ అధ్వర్యంలో మహరాష్ట్రలోని ధర్మబాద్ కు చెందిన షేక్ ఇమ్రాన్ అలియాస్ అబ్బు,షేక్ అర్బాజ్ అలియాస్ మాయాలు ప్రస్తుతం బాసరలోని శారధా నగర్ లో నివాసం ఉండి చోరిలకు పాల్పడినట్లు సాంకేతిక సహయంతో పట్టుకున్నారు.మహరాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెంది అమన్ అలియాస్ అమన్ ఫటేల్ పరారీలో ఉన్నారని ఏసిపి తెలిపారు.దోరికిన ఇద్ధరు దోంగల వద్ధ మూడు గోలుసులు ( 50 గ్రాముల ), ఓక బైక్ స్వాధినం చేకున్నారు.అమన్ పటేల్ కోసం గాలిస్తున్నారు.ముగ్గురు కలిసి గోలుసు దోంగతనాలు,బైక్ లకు చోరికి పాల్పడిన కేసులు ఎనిమిది కోలిక్కి వచ్చాయని ఏసిపి తెలిపారు.ఇద్ధరిని అరేస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఏసిపి పేర్కోన్నారు.

## తెలంగాణ సిఖ్ సొసైటీ సేవలు ప్రశంసనీయం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...





**కబురు న్యూస్,నిజామాబాద్,మార్చి 08 :** తెలంగాణ సిఖ్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అభినందించారు. తెలంగాణ సిఖ్ సొసైటీ వుమెన్ డెవలప్మెంట్ హబ్ శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో గల ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ పక్కన ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ముఖ్య అతిథిగా విచ్చేసి, వైద్య శిబిరాలు ప్రారంభించగా, తెలంగాణ సిఖ్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీ.జీ.పీ) తేజ్ దీప్ కౌర్ పాల్గొన్నారు. వైద్య శిబిరాలను ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ సిఖ్ సొసైటీ ద్వారా చేపడుతున్న సహాయ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాములబస్తీలో గల గురుద్వారాలో కలెక్టర్, రిటైర్డ్ డీజీపీ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తెలంగాణ సిఖ్ సొసైటీ వుమెన్ డెవలప్మెంట్ హబ్ కు శంకుస్థాపన చేశారు. గురుద్వారాకు ఆనుకుని రేకుల షెడ్లలో నివాసాలు ఉంటున్న సిక్కు కుటుంబాల ఇళ్లను సందర్శించి వారి జీవన స్థితిగతులను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అర్హులైన వారికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని రిటైర్డు డీజీపీ కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమాల్లో సిఖ్ సొసైటీ ప్రతినిధులు దర్శన్ సింగ్, మహేందర్ సింగ్, దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం...

**కబురు న్యూస్,బోధన్ మార్చి 08..** రాజీ మార్గమే రాజ మార్గమని, కక్షిదారులు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని న్యాయస్థానముల సముదాయ భవనంలో లోక్ అదాలత్ నిర్వహించారు. నిర్వహించిన లోక్ అదాలత్ లో వివిధ బెంచిలలో 1771 కేసులు పరిష్కారమయ్యాయి.ఐదవ అదనపు జిల్లా కోర్టులో ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ సమక్షంలో ఎంవోఓపి కేసులు 2 పరిష్కారం కాగా రూ.19 లక్షల 80 వేలు రికవరి అయ్యాయి. రెండు ఈపీ కేసులు పరిష్కారం కాగా రూ. 60 వేలు, ఒక క్రిమినల్ కేసు పరిష్కారమయ్యింది. వీటితో పాటు బ్యాంక్ కు సంబంధించిన కేసులు 49 పనిష్కరాం కాగా రూ. 28 లక్షల 23 వేల 200 రికవరీ అయ్యాయి.



జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పూజిత సమక్షంలో 51 కేసులు పరిష్కారం కాగా రూ. 4 లక్షల 14 వేలు రికవరీ అయ్యాయి.
అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయి శివ సమక్షంలో 114 కేసులు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ శేష తల్ప సాయి ఆధ్వర్యంలో 1552 కేసులు పరిష్కారం కాగా13 లక్షల 6,437 రూపాయలు రికవరీ అయ్యాయి.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు...

**కబురు న్యూస్, బోధన్ మార్చి 08..** బోధన్ పట్టణంలోని లయోలా ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేడుకలలో జజపాఠశాల యాజమాన్యం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు










తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY



# సురక్షిత ప్రయాణం,భద్రత కోసం మై ఆటో ఈస్ సేఫ్

- కోరుట్ల పట్టణంలో 350 ఆటోలకి క్యూ ఆర్ కోడ్ తో అనుసంధానం
- ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





కబురు న్యూస్,కోరుట్ల మార్చి 8

మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత ప్రయాణం ,భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో రిక్షాల సర్వీసెస్ వాహన యాజమాన్యం నుండి అవసరమైన డాక్యుమెంట్లు,సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారంను మీ "ఆటో ఐస్ సేఫ్" అప్ క్యూ ఆర్ కోడ్ ను కోరుట్ల పట్టణంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత, భద్రత కొరకు మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంబించడం సంతోషంగా ఉందని అన్నారు. జగిత్యాల జిల్లాలో 4000 లకు పైగా ఆటోలు ఉన్నాయని ఇప్పటి వరకు 2093 లకు పైగా ఆటోలకు క్యూ ఆర్ కోడ్ లను వేయడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో మిగతా ఆటోలో కూడా ఈ యొక్క స్టిక్కరింగ్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు కోరుట్ల పట్టణంలో సుమారు 350 ఆటో లకు (ఆటో ముందు, వెనక, డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా) స్టిక్కరింగ్ చేయడం జరిగిందని ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు "క్యూ ఆర్ కోడ్" అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలని అన్నారు. ప్రయాణికులకు భద్రత, నమ్మకాన్ని కల్పించాల్సిన అవసరం ఆటో డ్రైవర్లకు ఉందని తెలిపారు.అనే స్టిక్కరింగ్ ద్వారా అనుకోని సంఘటనలు జరిగునప్పుడు తొందరగా గుర్తించవచ్చునని అలాగే విలువైన వస్తువులు పోగొట్టుకున్నప్పుడు సులభంగా పట్టు కోవచ్చునని తెలిపారు.క్యూ ఆర్ కోడ్ ఉండటం వల్ల డ్రైవర్లు క్రమశిక్షణ బాధ్యతతో ఆటోలు నడుపుతారని చెప్పారు.ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన, దురుసుగా మాట్లాడిన, మరేయితర సమస్యలు ఎదుర్కొన్న ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుంది వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందవేయడంతో వెంటనే స్పందించి వాహనం యొక్క లైవ్ లొకేషన్ కి చేరుకుంటారని అన్నారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు అని పరిమితిని మించి ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటాం అన్నారు.మద్యం తాగి వాహనాలు నడపడం నేరం అని డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టు పడితే వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చెస్తామని అన్నారు..ఈ కార్యక్రమంలో డిఎస్పి రాములు ఆర్టీఓ శ్రీనివాస్, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ,కోరుట్ల సీ.ఐ సురేష్ బాబు,ఎస్. ఐ లు శ్రీకాంత్, శ్యామ్ రాజ్ , నవీన్, రాంచంద్రం పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు,ఓనర్స్ పాల్గొన్నారు..

## బ్రిలియంట్ పాఠశాలలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం



కబురు న్యూస్, ధర్మారం మార్చి 08:

ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాలలో అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సౌత్ ఇండియా జాయింట్ ట్రెజరర్, ఏఐసీసీ చైర్మన్, బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేత సిరిపురం సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారి సహకారంతో మహిళా సాధికారత సాధించిన మహిళలను ఘనంగా శాలువాలతో సన్మానించి, స్వీట్లు పంచుతూ, చీరలను బహుమానంగా ఇచ్చారు.ఈ సందర్భంగా సిరిపురం సత్యనారాయణ మాట్లాడుతూ: అతి సాధారణ పేదరిక పరిస్థితులను తట్టుకొని కుటుంబాన్ని, పిల్లలను ఉన్నతమైన స్థానంలో నిలబెట్టిన మహిళలు గోలాడ లక్ష్మీ, తోట రేవతి,గుమ్ముల భాగ్య, అర్దవెల్లి మంజుల, చిలుకూరి లక్ష్మీ వారి సాధికారతను గౌరవిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మా క్లబ్ ద్వారా సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా 258 రీజినల్ చైర్మన్ తాళ్లపల్లి సురేందర్ గౌడ్, జోన్ చైర్మన్ ఎలగందుల అశోక్, అధ్యక్షుడు మామిడి శెట్టి శ్రీనివాస్, కార్యదర్శి ఎలిగేటి మహేందర్, కోశాధికారి తోడేటి మురళి గౌడ్, ఉపాధ్యక్షులు బొల్లం మల్లేశం, బైరి చంద్రమౌళి, గౌరవ సభ్యులు గుర్రం సత్యనారాయణ, గుండేటి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవాలి డాక్టర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.



కబురు న్యూస్, గన్నేరువరం మార్చి 8

గన్నేరువరం మండల అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకం విడుదలైన నిధుల పనులను ఈనెల 25 లోపు పూర్తి చేయాలని లక్ష్యంతో పనిచేయాలని కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. విడుదలైన నిధులను ఉపయోగించుకొని, మండల అభివృద్ధికి పాటు పడతామని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొమ్మెర రవీందర్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల మాల వేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- తెలంగాణ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం డిమాండ్




కబురు న్యూస్,ధర్మారం మార్చి 08:

జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నగునూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల మాల వేసిన నిందితులను కటినంగా శిక్షించాలని తెలంగాణ మాలల ఐక్యవేధిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేషం డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: జగిత్యాల జిల్లా నగునూర్ గ్రామంలో జరిగిన ఘటన దురదృష్టకరమని,ఇలా జరగడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నామని,బారత రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి విగ్రహాన్ని అవమానించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను తిసుకురాలని వారు కోరారు.

## గుణుకుల కొండాపురం గ్రామ ప్రజలు నిరసన...



కబురు న్యూస్, గన్నేరువరం మార్చి 8

గన్నేరువరం మండలం గొనుకుల కొండాపూర్ గ్రామ ప్రజలు త్రివ ఇబ్బంది పడుతున్నామని, డబుల్ రోడ్డు సాంక్షన్ అయినప్పటికీ దానివలన అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైన కంకర వేసి రెండు నెలలు అవుతున్న ఎలాంటి పనులు జరగడం లేదు పొద్దున లేచినప్పటి నుండి మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్డు మార్గం గుండా స్కూల్, కాలేజీకి వెళ్లే పిల్లలకు ఈ రోడ్డు మార్గం గుండా వెళ్లాలంటే దుమ్ము ధూళి కళ్ళలోకి చేరి యాక్సిడెంట్లు అవుతున్నాయి. అందువలన తక్షణమే రోడ్డు పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ను కోరడమైనది. కనీసం రోడ్డుపైన వాటర్ పోస్తే బాగుంటదని కాంట్రాక్టర్ను కోరుచున్నాము.

# ప్రభుత్వ టీచర్ లింగమల్ల శంకర్ పై సస్పెండ్ ను వెంటనే ఎత్తి వేయాలి

- దళిత టీచర్ ను కులం పేరిట వేధింపులకు గురిచేసిన టీచర్ ల ను అరెస్ట్ చేయాలి
- అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మామిడి పల్లి బాపయ్య బొంకూరి మధు, లంక సదయ్య



కబురు న్యూస్, రామగుండం,మార్చి, 08:

అకారణంగా సస్పెండ్ గురైన పెద్దపల్లి జిల్లా నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న లింగంపల్లి శంకర్ పై సస్పెండ్ ఎత్తివేసి అతడిని యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, జిల్లా కలెక్టర్ కు, జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని లోని తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ భవన్ లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు జిల్లా కన్వీనర్ లంక సదయ్య లు మాట్లాడారు.నిట్టూరు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో, స్కూల్ అసిస్టెంట్ గా, విధులు నిర్వహిస్తున్న,లింగమల్ల శంకర్, తన భార్య జ్యోతి అదే గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు అన్నారు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ జ్యోతి జడ్ పి ఎచ్ ఎస్ చెందిన టీచర్ లు ఎస్ రోషన్ కుమార్, ఆర్ ,వినోద్, కే సమ్మయ్య, ల ద్వారా వేధింపులకు అవమానాలకు అవహేళనకు, గురవుతున్న తరుణంలో పెద్దపెల్లి పోలీస్ స్టేషన్ లో ముగ్గురు టీచర్ ల పై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.అంతేకాకుండా వారిపై దళిత మహిళ ఉపాధ్యాయురాలుని వేధింపులకు గురి చేస్తున్నందుకు, పెద్దపల్లి పోలీస్ స్టేషన్ లో కూడా కేసు కూడానమోదయిందన్నారు.అది మనసులో పెట్టుకొని జ్యోతి భర్త లింగమల్ల శంకర్ కు ఎలాంటి సంబంధం లేకపోయినా కుట్రపూరితంగా వ్యవహరించిన ఉపాధ్యాయులు రోషన్ కుమార్, వినోద్, సమ్మయ్యలు,లింగమల్ల శంకర్ అనే టీచర్ , పాఠశాలలో గుడ్ మార్నింగ్ బదులు జై భీమ్ అనిపిస్తున్నాడని సంబంధంలేని విషయాన్ని రాద్ధాంతం చేశారని ఆరోపించారు. లింగమల్ల శంకర్ తన సతీమణి బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు పూలే లాంటి సామాజిక ఉద్యమ స్ఫూర్తి ప్రదాతల పుస్తకాలను ఉచితంగా అందజేయడం తప్ప అన్నారు. వారు ఎలాంటి తప్పు నేరం చేయలేదన్నారు.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు తమపై నమోదు అయిందని తెలుసుకున్న ముగ్గురు ఉపాధ్యాయులు అరెస్టు అవు తామన్న భయంతో కౌంటర్ కేసు నమోదు చేయించాలని కుట్రపూర్త ఆలోచనతో లింగమల్ల శంకర్ కుల మతపరమైన ప్రస్తావన తీసుకొస్తున్నాడని తప్పుడు సమాచారాన్ని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు డీఈఓ కు పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల చేత ఇప్పించారన్నారు.దశాబ్ద కాలానికి పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న భార్యాభర్తల పై ఏనాడు చిన్న ఆరోపణలు కూడా రాలేదని అని అన్నారు , నిట్టూరులో మాత్రం ఉపాధ్యాయులు తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల చేత ధర్నాలు చేయించి కలెక్టర్ డీఈవోకు ఫిర్యాదు చేయిస్తున్నారనిఆరోపించారు.లింగమల్ల శంకర్ పై సస్పెండ్ ను ఎత్తి వేయించి యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని, అదేవిధంగా ఎస్సీ ఎస్టీ,మహిళా టీచర్లు ఉద్యోగులు, అవసరాల కోసం శరీరాన్ని శీలాన్ని అమ్ముకుంటారని, అవమానపరిచి టీచర్ ను కులం పేరుతో దూషించిన ముగ్గురు ఉపాధ్యాయులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తక్షణమే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.పవిత్రమైన,ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న, ముగ్గురు టీచర్ ల పై, నేషనల్ ఎస్సీ ఎస్టీ కమిషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యుల దృష్టికి, ఉన్నత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు, ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి పాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా కన్వీనర్ లంక సదయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపల్లి సతీష్, మంతెన లింగయ్యపాల రాజేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇగురాల కృష్ణయ్య, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్,జిల్లా కో కన్వీనర్లు దుబాసి బొందయ్య, ఆకునూరి బాల అంకుష్ గద్దల శశిభూషణ్, పోగుల రంగయ్య, ఇండి బిల్లి రవీంద్ర కుమార్, పెగడ పల్లి నారాయణ కలవల రాజేశం ఎండి నవాబ్ మేకల సురేష్ బూడిద సంపత్, దొమ్మటి శేఖర్ పుల్లూరి మహేందర్, తదితరులు పాల్గొన్నారు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రిన్సిపాల్ వడ్లూరి జ్యోతిరాణి




కబురు న్యూస్, ధర్మారం మార్చి 08:

సృష్టికి మూలమైన మహిళలు అన్ని రంగాల్లో రాణించి, సమాజంలో మంచి పేరును సంపాదించుకోవాలని క్రిష్ణవేణి టాలెంట్ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ వడ్లూరి జ్యోతిరాణి ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ ప్రైమరీ స్కూల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాటశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లులతో పాటు మహిళా ఉపాధ్యాయులతో కలసి ఈ వేడుకలను జరిపారు.మొదటగా సరస్వతిదేవి చిత్రపటం ఎదుట జ్యోతిప్రజ్జలన చేసి ప్రిన్సిపాల్ జ్యోతిరాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆ తర్వాత ప్రిన్సిపాల్ తో పాటు మహిళలంతా కలసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లులకు పలు రకాల ఆటలును ఆడించి, గెలుపొందిన వారికీ బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వడ్లూరి జ్యోతిరాణి మాట్లాడుతూ:

మహిళా శక్తి అనేది ఆకాశమంతా ఉంటుందని, ప్రతి ఒక్క మహిళా తమ గొంతును వినిపించి మరింత ముందుకు రావాలని కోరారు.మహిళలపై జారుతున్న హత్యచారాలపై, వరకట్న వేధింపులపై ప్రభుత్వాలు మరింత దృష్టి సారించి, మహిళలకు అండగా ఉండాలని డిమాండ్ చేసారు.మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివి, అన్ని రంగాల్లో ఆడవారిని సమానంగా చూడాలన్నారు. మహిళలు తమ కాళ్ళపై తాము స్వతహాగా నిలబడే శక్తి, ప్రతిఒక్క మహిలలో రావాలని ఆకాంక్షించారు.ఈ యొక్క వేడుకల్లో పాఠశాల సిబ్బంది తో పాటు,విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

కబురు
KABURU TELUGU DAILY
ఆదివారం మార్చి 09 2025

# మహిళల ప్రగతితోనే సమాజ అభివృద్ధి

- బాలికలూ ఉన్నత చదువులు చదవాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- కలెక్టరేట్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం






**కబురు న్యూస్, కరీంనగర్ మార్చి 08:** మహిళలు ఉన్నత చదువులు చదివి, ఆర్థిక ప్రగతి సాధిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని.. బాలురతో సమానంగా బాలికలను పెంచి ఉన్నత చదువులు చెప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు వస్తాయని.. ఎంత కష్టమైనా ఉన్నత చదువులు చదవాలని బాలికలకు సూచించారు. మహిళలు ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని.. అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఇంటి పనులు, ఉద్యోగ విధులతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఉన్నత చదువులు, ఆర్థిక స్వేచ్ఛ మహిళల సొంతమైతే సాధికారత సాధ్యమవుతుందన్నారు. సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ...పిల్లలకు ఎలాంటి ప్రవర్తన నేర్పుతున్నామన్నది తల్లిదండ్రుల పై ఆధారపడి ఉంటుందన్నారు. మంచి, చెడు చెప్పి విచక్షణ కల్గిన పిల్లలుగా తీర్చిదిద్దాలన్నారు. ఎవరు వస్తారని ఎదురు చూడకుండా మనకు మనం ఎదగాలన్నారు. బాలికల హక్కులు, మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి కలెక్టర్ ను వివిధ శాఖల ఉన్నతాధికారులు సన్మానించారు. శ్రీనిధి రుణాల్లో పనితీరు కనబరిచినందుకు జమ్మికుంట, హుజురాబాద్ పట్టణ సమాఖ్య అధ్యక్షురాళ్లకు సర్టిఫికెట్, మెమోంటో అందించారు. ఈ సందర్భంగా బాలభవన్ చిన్నారులు , వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు, యోగ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,జిల్లా అదనపు వైద్యాధికారి సుజాత, మెప్మా పిడి వేణుమాధవ్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, సీడీపీఓలు అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి విజయలక్ష్మి వెంకటేశ్వర్లు







**కబురు న్యూస్, రామగిరి మార్చ్ 08.** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సింగరేణి సంస్థ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ సతీమణి విజయలక్ష్మి వెంకటేశ్వర్లు అన్నారు.రామగుండం-3 ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కమ్యూనిటీ హాలు నందు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మివెంకటేశ్వర్లు,విశిష్ట అతిథులుగా హాజరైన సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర రావు,వెంకటలక్ష్మి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను ఘనంగా ప్రారంభించారు.అనంతరం కేక్ ను కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని,వారిని ఆదర్శంగా తీసుకుని మన పిల్లలను కూడా ప్రోత్సహించాలని సూచించారు.మహిళతోనే మానవ మనుగడ అని,మహిళ సహకారం లేకపోతే ప్రగతి శూన్యం అన్నారు.భార్యగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే,ఉద్యోగినిగా సేవలందిస్తున్న మహిళలను అభినందించారు.మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంతో,చాకచక్యంతో ముందుకెళ్లాలని కోరారు.సింగరేణి సంస్థ మహిళా సాధికారత కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న టైలరింగ్,మగ్గం వర్క్,ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ లాంటి నైపుణాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని అన్నారు. తదుపరి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో సేవా సభ్యులు,సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు జానపద,సినీ గీతాలతో చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.అనంతరం వివిధ ఆటల పోటీలు,క్విజ్ పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతి ప్రధానం చేశారు.అలాగే వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు.ఈ వేడుకలకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు హాజరై మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,డిప్యూటి పర్సనల్ మేనేజర్లు గుర్రం శ్రీహరి,వి.సునీల్ ప్రసాద్, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ పి.రాజేశం,సంక్షేమాధికారి ప్రీతి, సేవా కార్యదర్శి కె.మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఆర్.ఉమాదేవి,సేవా కోఆర్డినేటర్ కె.సుధాకర్,మహిళా ఉద్యోగులు,సేవా సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించిన నిమ్మరాజుల రవి:





**కబురు న్యూస్, రామగుండం మార్చి 08:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సామాజిక సేవకులు నిమ్మరాజుల రవి- రజిని ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సమాజసేవలో తమ వంతు పాత్ర పోషిస్తున్న ఉత్తమ మహిళలు అయినటువంటి గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్వాడి టీచర్, ఆశ వర్కర్, ఉపాధి హామీకి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్, వివో సంఘాల అధ్యక్షులు, గంగపుత్ర మహిళా మత్స్య సహకార సొసైటీ అధ్యక్ష కార్యదర్శులను, గ్రామపంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.నిమ్మరాజుల రవి మాట్లాడుతూ...... ఆడది అంటే అబల కాదు సభల అని, ఈ సృష్టికి మూలం అయిన ఆదిపరాశక్తి ఆడదే అని, ప్రతి ఇంటిలో మహిళలేని ఇల్లు అంధకారమని ,ప్రతి రంగంలో ఇప్పుడు మహిళలు ముందుంటున్నారని, ముఖ్యంగా రాజకీయ సేవారంగంలో తమదైన ముద్ర వేస్తున్నారని ,,అయినప్పటికీ సమాజంలో మహిళలపై అగత్యాలు కొనసాగుతున్నాయని వాటిని నిర్భయంగా ధైర్యంగా ఎదుర్కొని నిలవాలని మహిళలను హింసిస్తే చెడుపై మంచి చేసే సంహారం తప్పదని, మహిళలందరూ ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని భవిష్యత్తులో తమదైన రంగంలో ముందుకెళ్లాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ పెద్దపల్లి మంజుల గంగారపు వనజ శ్యామకూరి రమాదేవి ఇరికిల్ల పద్మ పల్లికొండ కళ్యాణి జాడి జ్యోతి పల్లికొండ రాజమ్మ నిట్టూరి బూదమ్మ ఇరికిల్ల గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శంకరపట్నంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు...





**కబురు న్యూస్, శంకరపట్నం మార్చి 8** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శంకరపట్నం మండలంలో ఘనంగా మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి ,మిఠాయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండలంలోని, కేశవపట్నం గ్రామంలో దేవసేన గ్రూప్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేసినట్లు స్వరూప తెలిపారు..ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి,కళావతి, శ్రీదేవి,రాధా,మహేశ్వరి, శారద,స్వప్న,లక్ష్మి,వనిత,అఖిల,సుష్మ,స్వప్న,రమ్య,లలిత మంగ,ఉమా,అనిత, కోమల కనకమ్మ,శాంత తదితరులు పాల్గొన్నారు.

# గంగారం జిపి లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు..



- గ్రామ ప్రత్యేక అధికారి( డిటి) సయ్యద్ నిజాముద్దీన్...

**కబురు న్యూస్, వీణవంక,మార్చి 8.** అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని, వీణవంక మండలములోని గంగారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వివిధ శాఖలు (ఈజీఎస్, ఐకేపీ సి సి. లు, అంగన్వాడీ సిబ్బంది) పనిచేయుచున్న మహిళా ఉద్యోగులను, మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్, (డిటి ) సయ్యద్ నిజామోద్దీన్ , ఎండిఓ శ్రీధర్,ఎంపీ ఓ సురేందర్ కుమార్, ఎస్ బి ఎం కోఆర్డినేటర్ రమేష్, సూపరింటెండెంట్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కిషన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం






**కబురు న్యూస్, రామగిరి మార్చ్ 08.** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక తాజా మాజీ సర్పంచ్ గంట పద్మ వెంకటరమణారెడ్డి హాజరైనారు మాజీ సర్పంచ్ గంట పద్మా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మంథని శాసనసభ్యులు మంత్రి శ్రీధర్ బాబు మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత కరెంటు మహిళలకు గ్యాస్ 500 రూపాయలకు ఇప్పించిన ఘనత శ్రీధర్ బాబు కి దక్కింది మహిళలను కోటీశ్వరుని చేయాలని ఉద్దేశంతో ఆర్టీసీలో మహిళా సంఘాలకు 80% సబ్సిడీతో బ్యాంకు రుణం ఇప్పించి కాంట్రాక్ట్ బస్సు సర్వీసులను ఇప్పించిన ఘనత శ్రీధర్ బాబు మహిళలు అన్ని రంగాలలో ముందుకు తీసుకెళుతుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళ సోదరీమణులకు కుంకుమ భరిణిలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఏఎన్ఎం ఆశ వర్కర్స్,వివో అధ్యక్షురాలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు:







**కబురు న్యూస్, సెంటనరీకాలని మార్చి 08:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా మహిళ దినోత్సవ వేడుకలు స్థానిక శ్రీపాద భవన్ ఐ ఎన్ టి సి ఆఫీస్ లో నిర్వహించడం జరిగింది.రామగిరి మండలంలోని మహిళా సోదరీమణులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహిళా సోదరీమణులకు శాలువాతో సన్మానం చేసి, కేక్ కట్ చేసి,పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు, తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య, మండల మహిళా అధ్యక్షురాలు రాధారెడ్డి, ఎక్స్ ఎంపీపీ కోరుకొప్పుల నీరజ తులసిరామ్ గౌడ్, తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, మండల మహిళా నాయకురాలు జాగిరి రజిత, కెక్కర్ల స్వరూప, ఆరేల్లి విజయ, మొగిలి రేణుక, సదాలక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు బర్ల శ్రీనివాస్, ఆరెల్లి కొమురయ్య, ముత్యాల శ్రీనివాస్ తీగల సమ్మయ్య, దాసరి శివ, మోత్కూరి అవినాష్, ఎరుకల బాబురావు, కండెపోషం, రామగిరి నాగరాజు, పీవీ గౌడ్, సిద్ధం రామనారాయణ ,బంకు మల్లేష్ ,సాదాచక్రి, బత్తుల శంకర్,గౌ రెడ్డి తదితరులు మాట్లాడుతూ..... సృష్టికి మూలం మహిళ మూర్తులని, వారిని గౌరవించడం అందరి బాధ్యత అని, స్త్రీ లేకపోతే జననం లేదనీ,స్త్రీ లేకపోతే గమనం లేదనీ,స్త్రీ లేకపోతే జీవం లేదనీ ,స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదనీ,కంటికి కాపలాగా కాపాడే స్త్రీ మూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తూన్నమని వారు అన్నారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110 కబురు KABURU TELUGU DAILY

# రిలీజ్ కి ముందే రికార్డులు బ్రేక్ చేస్తున్న కన్నప్ప.. బ్లాక్ బస్టర్ హిట్ తప్పదా..?



కబురు సినిమా మార్చి08:
టాలీవుడ్ స్టార్ హీరో మంచు విష్ణు కన్నప్ప అనే సినిమాలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ రుద్ర అనే కామియో పాత్ర చేస్తుండగా బాలీవడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ శివుడి పాత్రలో నటిస్తున్నాడు. తమిళ్ మళయాళ నటులు శరత్ కుమార్, మోహన్ లాల్ తదితరులు కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఈ సినిమా రెండో టీజర్ ని మేకర్స్ పాన్ ఇండియా భాషల్లో సోమవారం రిలీజ్ చేశారు. మంచి ఇంటెన్సివ్ బ్యాక్ డ్రాప్ లో కట్ చేసిన రెండవ టీజర్ ఆడియన్స్ ని బాగానే ఆకట్టుకుంటోంది. అయితే ఈ టీజర్ రిలీజ్ చేసిన 6 రోజుల్లోనే దాదాపుగా 35 మిలియన్స్ కి పైగా వ్యూస్ వచ్చాయి. ఇందులో తెలుగులో మాత్రమే 21 మిలియన్ వ్యూస్ ఉండగా హిందీలో 10 మిలియన్ కి పైగా వ్యూస్ వచ్చాయి.. ఇతర భాషల్లో 4 మిలియన్ వ్యూస్ వచ్చాయి. దీంతో మేకర్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ మధ్య రిలీజ్ అయిన మెగాస్టార్ చిరంజీవికి విశ్వంభర సినిమా టీజర్(24 మిలియన్స్) వ్యూస్ రికార్డులని బ్రేక్ చేసింది. అంతేహ్కాదు మంచు విష్ణు కెరీర్ లోనే హయ్యెస్ట్ వ్యూస్ వచ్చిన టీజర్ గా రికార్డులు క్రియేట్ చేసింది..అయితే ఇప్పటివరకూ సరైన బ్రేక్ లేక, రాక ఇబ్బంది పడుతున్న హీరో మంచు విష్ణు కన్నప్ప సినిమాతో సాలిడ్ హిట్ అందుకోవాలని ప్లాన్ చేస్తున్నాడు.. దీంతో స్టోరీ, ప్రొడక్షన్ పనులు, మేకింగ్, టెక్నీకల్ పనులు ఇలా ప్రతీది దగ్గరుండి చూసుకుంటున్నాడు.. అయితే ఈ సినిమాని పాన్ ఇండియా భాషలతోపాటూ ఇంగ్లీష్ లో కూడా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. కన్నప్ప ఏప్రిల్ 28న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది.

# మహిళలు సాధించాల్సింది ఎంతో ఉంది – మాధురీ దీక్షిత్



కబురు సినిమా మార్చి08:
ఐఫా వేడుకలకు జైపుర్ సిద్ధమైంది. ఇప్పటికే అగ్రతారలు అక్కడికి చేరుకున్నారు. తాజాగా ఆ వేడుకలో పాల్గొన్న మాధురీ దీక్షిత్ మహిళా దినోత్సవం సందర్భంగా సినీరంగంలో మహిళల పారితోషికాల్లో వ్యత్యాసంపై చర్చించారు. మహిళలు సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత గునీత్‌తో కలిసి 'ది జర్నీ ఆఫ్ సినిమా' సెషన్‌లో మాధురీ మాట్లాడారు.సినిమాల్లో నటీనటుల వేతనాల గురించి మాధురీ ప్రస్తావిస్తూ.. "మహిళల విషయంలో వారు తమను తాము పదేపదే నిరూపించుకోవాల్సి వస్తోంది. మనం కూడా ప్రేక్షకులను అగ్ర హీరోల వలే ఆకర్షించగలం. కానీ, మనం దానిని ప్రతిసారీ నిరూపించుకోవాల్సి వస్తోంది. అలాగే పారితోషికం విషయంలోనూ ఇంకా అసమానతలు ఉన్నాయి. వాటిని అధిగమించాలి" అని చెప్పారు. నిర్మాత గునీత్ మాట్లాడుతూ.. "సినీరంగంలోని వేతన వ్యత్యాసం గురించి నటులు సమాధానం చెప్పాలని నేను కోరుకుంటున్నాను. మహిళలు ఇప్పటికే ఎన్నో అవకాశాలు కోల్పోయారు. మన అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. 'స్త్రీ2' లాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అలాంటివి తెరకెక్కిస్తేనే మహిళలకు మరింత గుర్తింపు వస్తుంది" అని అన్నారు.

ఇక ఈ 'ఐఫా' వేడుకల్లో అమితాబ్ బచ్చన్ 'షోలే'కు అరుదైన గౌరవం దక్కనుంది. ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టులో 50ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా జైపుర్ రాజ్‌మందిర్‌లో ప్రదర్శించనున్నారు. "2025 ఐఫా అవార్డులు కేవలం ఓ వేడుక మాత్రమే కాదు. 50వసంతాల షోలే ప్రయాణానికి గౌరవం. 'షోలే' అనేది కేవలం సినిమా మాత్రమే కాదు. ఇది ఒక ఎమోషన్. దీన్ని గౌరవించడానికి ఐదు దశాబ్దాలుగా సినీ ప్రేమికుల ఆదరాభిమానాలు దక్కించుకున్న రాజ్‌మందిర్ థియేటర్ కంటే మంచి వేదిక ఎక్కడుంది" అని ఐఫా సహ వ్యవస్థాపకుడు

# పోరాటమే విజయ సూత్రం



కబురు సినిమా మార్చి08:
"అప్పుడే ఏమీ అయిపోలేదు.. చేయాల్సిన ప్రయాణం.. పోరాటం ఇంకా చాలా ఉంది" అంటోంది నటి సమంత . వెండితెరపై 15వసంతాల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ఆమె.. ఇక్కడి దాకా వేసిన ప్రతి అడుగులోనూ ఒక పాఠాన్ని.. దాని నుంచి ఓ పోరాటాన్ని అలవర్చుకున్నట్లు తెలిపింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన విజయాలు.. పరాజయాలు రెండూ పోరాట తత్వాన్నే నేర్పించాయంది. "ఓసారి ఆకాశమంత విజయం దక్కిందంటే చాలు.. చాలా మంది ఓ సంతృప్తితో విశ్రమిస్తుంటారు. కానీ, నేను దాన్ని ఓ సవాల్‌లా తీసుకుంటా . దానికి మించిన విజయాన్ని సాధించాలన్న లక్ష్యంతో నటిగా అక్కడి నుంచి మరో కొత్త పోరాటాన్ని ప్రారంభిస్తా. అదే పరాజయం పలకరిస్తే దాన్నొక మచ్చగా భావిస్తా. ఒకరకంగా విజయం, పరాజయం ఈ రెండూ నేర్పిన పోరాటతత్వమే నా ఈ సుదీర్ఘ ప్రయాణానికి విజయసూత్రమని నమ్ముతా" అని చెప్పుకొచ్చింది సమంత.

# 'కోర్ట్..' నచ్చకపోతే.. నా 'హిట్ 3'ని ఎవరూ చూడకండి: నాని




కబురు సినిమా మార్చి08:
"ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రల ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితో పాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచాల్లోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని 'కోర్ట్'తో నేను పొందగలిగా. ఇప్పుడా అనుభూతినే ప్రేక్షకులు పొందాలన్నది నా తాపత్రయం. అందుకే ఈ నెల 14న 'దయచేసి థియేటర్‌కు వెళ్లండ'ని అడుగుతున్నా. ఇది కచ్చితంగా తెలుగులో ఓ గొప్ప కోర్ట్ రూం డ్రామాగా నిలిచిపోతుంది" అన్నారు కథానాయకుడు, నిర్మాత నాని. ఇప్పుడాయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్ష వర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. దీంట్లో ఆయనతో పాటు దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిత్ర సమర్పకుడు నాని మాట్లాడుతూ.. "నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో 'దయ చేసి ఈ సినిమా చూడండి' అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. అందుకే ఇంతగా బతిమలాడుతున్నా. ఇది మీ అంచనాల్ని అందుకోలేదు అనిపిస్తే మరో రెండు నెలల్లో విడుదల కానున్న నా 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా నేనేమీ చెప్పలేను. ఎందుకంటే దీనికన్నా 10రెట్లు ఎక్కువగా 'హిట్ 3'పై ఖర్చు పెట్టా. ఈ నెల 14వరకే 'ఈ సినిమా చూడమ'ని నేను అందరికీ చెప్తా. ఆ తర్వాత నుంచి మీరే ఆ మాట ప్రతి ఒక్కరికీ చెప్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ, దీప్తి గంటా, ప్రశాంతి, విజయ్ బుల్గానిన్, శ్రీదేవి, రోహిణి, సురభి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# ఆ క్షణాలు ఇప్పటికీ గుర్తు.. తలుచుకుంటే బాధగా ఉంటుంది



కబురు సినిమా మార్చి08:
**మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మెగా ఉమెన్స్ పేరుతో స్పెషల్ ఇంటర్వ్యూ విడుదలైంది. అమ్మ అంజనాదేవి, సోదరీమణులు, సోదరుడు నాగబాబుతో ఇంటర్వ్యూలో పాల్గొన్నారు చిరంజీవి. తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలు పంచుకున్నారు.**



**అమ్మ నన్ను చూసి మా అబ్బాయి కాదంది: చిరంజీవి**

ఇంట్లో అందరికంటే నేనే ఎక్కువ చలాకీగా ఉండేవాడిని. నాకు మూడేళ్ల వయసు ఉన్నప్పుడు జరిగిన సంఘటనను అమ్మ ఎప్పుడూ చెబుతుంటుంది. సరదాగా ఆడుకుంటూ ఇంట్లో నుంచి రోడ్డు మీదకు వచ్చేసి.. ఎటు వెళ్లాలో అర్థం కాక ఏడ్చుకుంటూ రోడ్డు మీద కూర్చొన్నాను. అక్కడే ఉన్న ఒకాయన నన్ను చూసి తన కొలిమిలోకి తీసుకువెళ్లారు. ఇంట్లో వాళ్లకు కబురు చేశారు. అమ్మ వచ్చేసరికి నేను ఒళ్లంతా మసి పూసుకుని కూర్చొన్నా. నన్ను చూసి అమ్మ గుర్తు పట్టలేకపోయింది. వీడు మా అబ్బాయి కాదు అని చెప్పేసింది. ఎందుకో అనుమానం వచ్చి ఆగి తర్వాత గుర్తుపట్టింది. ఆ తర్వాత ఇంటికి తీసుకువచ్చి నన్ను తాళ్లతో కట్టేసింది. అమ్మ నా చలాకీతనాన్ని అల్లరి అనుకునేది.

**పవన్‌కల్యాణ్ స్పెషల్ కిడ్: నాగబాబు**

మా ఇంట్లో పవన్ కల్యాణ్ స్పెషల్ కిడ్. చిన్నప్పటినుంచి తను సరిగ్గా తినేవాడు కాదు. దాంతో అమ్మానాన్న వాడిని బాగా గారాబం చేసేవారు. తనకు నచ్చిన ఫుడ్ వండటానికే అమ్మ ఇష్టం చూపించేది.

**ఆ క్షణాలు ఇప్పటికీ గుర్తున్నాయి: చిరంజీవి**

అమ్మకు ఇప్పుడు మేము ఐదుగురు బిడ్డలం. అయితే, మరో ముగ్గురు బిడ్డలు చిన్న వయసులోనే చనిపోయారు. నాన్న ఉద్యోగరీత్యా పనుల్లో బిజీగా ఉంటే అమ్మే ఇంట్లోని అన్ని పనులు చూసుకునేవారు. గృహిణిగా అన్ని బాధ్యతలు ఆమె ఒక్కరే చూసుకునేవారు. దాంతో చిన్నప్పటి నుంచి నేను ఆమెకు పనుల్లో సాయం చేస్తూ ఉండేవాడిని. నేను ఆరో తరగతిలో ఉన్నప్పుడు రమ అని నాకొక సోదరి ఉండేది. ఒకసారి తను అనారోగ్యానికి గురైంది. దాంతో తనని అమ్మ, నేను కలిసి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాం. నాన్నకు ఈ విషయం తెలియదు. రెండు రోజుల తర్వాత చనిపోవడంతో ఆమెను చేతుల్లో ఎత్తుకొని ఇంటికి తీసుకువెళ్లాం. చుట్టుపక్కల వాళ్లు సాయం చేయడంతో ఆ తర్వాత కార్యక్రమాలు పూర్తిచేశాం. తెలిసిన వారి ద్వారా నాన్నకు సమాచారం అందించాం. ఆయన వచ్చేసరికి అంతా అయిపోయింది. ఆ క్షణాలు ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. తలచుకుంటే బాధగా అనిపిస్తుంది.

**ఈతరం వాళ్లకు నేనిచ్చే సలహా అదే: అంజనాదేవి**

కలిసిమెలిసి ఉంటే ఎంతో బాగుంటుంది. తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు అందరూ ఒకరికొకరు తోడుగా ఉంటే చూడముచ్చటగా ఉంటుంది. ఇప్పుడు ఉన్న రోజుల్లో మనుషుల మధ్య ప్రేమలు లేవనిపిస్తుంది. ఎవరి పనులు వాళ్లు చేసుకుంటూ జీవితాన్ని గడిపేస్తున్నారనిపిస్తుంది. ఒకరికొకరు భరోసా ఉంటే ఆ సంసారం సంతోషంగా సాగుతుంది. పిల్లలతోనే కాదు కోడళ్లతోనూ నాకు మంచి అనుబంధం ఉంది. సురేఖ (చిరంజీవి సతీమణి) నాకు కోడలు కాదు కూతురు.

**నాన్న మాటకు అర్థం 'మగధీర' సమయంలో తెలిసింది: చిరంజీవి**

చిన్నతనం నుంచి మా తల్లిదండ్రులు మాకు స్వేచ్ఛను ఇచ్చారు. సినిమాల్లోకి వెళ్తానంటే కాస్త భయపడినప్పటికీ కాదని మాత్రం చెప్పలేదు. వాళ్లు ఇచ్చిన స్వేచ్ఛ వల్లే మరింత బాధ్యతాయుతంగా ముందుకుసాగాను. షూటింగ్స్‌లో అలసిపోయి వచ్చినప్పుడు నాన్న నాకెంతో సపోర్ట్‌గా ఉండేవారు. అమ్మలా నన్ను చేరదీసేవారు. 'గూండా' షూటింగ్ సమయంలో ట్రైన్ సీక్వెన్స్ చేస్తున్నప్పుడు నాన్న అక్కడే ఉన్నారు. షూట్ పూర్తికాగానే నాపై కోప్పడ్డారు. 'ఎందుకు ఇలాంటివి అన్నీ చేస్తుంటావ్' అని కేకలు వేశారు. మరేం ఫర్వాలేదని నేను నచ్చజెప్పినప్పటికీ.. 'రేపు నీకొక కొడుకు పుట్టి.. వాడు ఇలాంటివి చేస్తుంటే నా భయం ఏమిటో నీకు తెలుస్తుంది' అనేవారు. 'మగధీర' షూట్‌లో గుర్రంపై నుంచి చరణ్ పడిపోయాడు అని విన్నప్పుడు.. ఆ రోజుల్లో నాన్న నా విషయంలో ఏవిధంగా ఫీలయ్యారో మొదటిసారి నాకు చరణ్ విషయంలో అలాంటి కంగారు వచ్చింది. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో పీటర్ హెయిన్స్ ఒక స్టంట్ చేస్తూ కిందపడిపోతే ఏడెనిమిది నెలల పాటు ఆస్పత్రిలోనే ఉన్నాడు. చరణ్‌కు ఏమవుతుందోనని నేనెంతో భయపడ్డాను.



# 'లగాన్' కచ్చితంగా ఫ్లాప్ అవుతుందనుకున్నా..

కబురు సినిమా మార్చి08:
బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్‌ఖాన్ తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన 'లగాన్' సినిమా గురించి ఓ కార్యక్రమంలో ప్రస్తావించారు. ఆరుపదుల వయసు వస్తున్నప్పటికీ తన మనసు మాత్రం 18 ఏళ్ల దగ్గరే ఆగిపోయిందని చెప్పిన ఆమిర్.. అద్దంలో చూసుకున్నప్పుడు మాత్రం నిజమైన వయసు కనిపిస్తుందని సరదాగా చెప్పారు. కెరీర్‌లో తాను ఎదుర్కొన్న సవాళ్లను చర్చించారు.కెరీర్ గురించి మాట్లాడుతూ.. "లగాన్' సమయంలో ఎంతో భయపడ్డాను. 'నువ్వు ఏ ధైర్యంతో తెరకెక్కిస్తున్నావు. ఎందుకు ఇలాంటి సినిమా తీస్తున్నావు. ఒక్క రోజు కూడా ఆడదు' అని పరిశ్రమలో చాలామంది అన్నారు. ఆ సమయంలో క్రికెట్ గురించి గొప్పగా తీసిన సినిమాలు కూడా ఆడలేదు. అలాంటప్పుడే నేను 'లగాన్' తీశాను. ఆ రోజుల్లో అమితాబ్ వాయిస్ ఓవర్ ఇచ్చిన సినిమా ఫ్లాప్ అవుతుందని అందరూ అనుకునేవారు. 'లగాన్'కు అమితాబ్ వాయిస్ కూడా ఇచ్చారు. దీంతో కచ్చితంగా ఆదరణ లభించదని అనుకున్నా. కానీ, నా అంచనాలను తలకిందులు చేసి సూపర్ హిట్‌గా నిలిచింది" అని చెప్పారు.లగాన్ సినిమా విషయానికొస్తే.. 2001లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, పలు అవార్డులు సొంతం చేసుకుంది. భువన్‌గా ఆమిర్ నటన అందరినీ కట్టిపడేసింది. బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లను సొంతం చేసుకుంది . మూడేళ్ల పాటు పన్నుల నుంచి మినహాయింపు పొందడానికి మన దేశంలోని ఓ ప్రాంతానికి చెందిన కొందరు ఓ టీమ్‌గా ఏర్పడి తెల్లవాళ్లతో క్రికెట్ ఆడి గెలిచిన తీరుకి ప్రేక్షకులు నీరాజనం పట్టారు.ఆమిర్ ఖాన్ 60వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని పీవీఆర్ ఐనాక్స్ నిర్ణయించింది. ఇందులోభాగంగానే దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఆయన నటించిన చిత్రాలు ప్రదర్శించనున్నారు. 'ఇండస్ట్రీలో ఎంతోమందిలో ఆమిర్ స్ఫూర్తినింపారు. ఎప్పుడూ సాహసోపేతమైన స్క్రిప్ట్‌లను ఎంచుకుంటారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com